# వైఎస్ఆర్-అన్నమయ్య వార్త

తెలుగు జాతీయ దినపత్రిక

మంగళవారం 28 మార్చి 2023


### ఎంపి గారూ! చెన్నై వెళ్లే రైళ్లను

## కోడూరులో ఆపలేరా?

రైల్వేకోడూరు రూరల్, మార్చి 27 ప్రభాతవార్త

బ్రిటీష్ కాలం నుండి ఎంతోమందికి ప్రయాణాన్ని ఇచ్చిన చెన్నై రైళ్లు ఆగి ప్రయాణికులకు ఎంతో సౌకర్యాలు అందించిన సందర్భంలో గత రెండున్నర సంవత్సరంగా కరోనా సమయం నుండి చెన్నైకి వెళ్లే రైళ్లు ఆగకపోవడం అత్యంత బాధాకరమైన విషయమని రైల్వే ప్రయాణికులు పేర్కొంటున్నారు. రాజంపేట పార్లమెంట్ సభ్యులు ఈ విషయాన్ని సంబంధిత రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని రైల్వే ప్రయాణికులు కోరుతున్నారు. ముఖ్యంగా రెండు రోజుల క్రితం రాజంపేట ప్రాంతాల్లో రైళ్లను ఆపమని ఎంపి మిథున్‌రెడ్డి లెటర్‌లు ఇవ్వడం జరిగిందని, అదేవిధంగా పార్లమెంట్ పరిధిలో ఉన్న రైల్వేకోడూరులో కూడ ఎందుకు చేర్చలేదని రైల్వే ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఎంపి మిథున్‌రెడ్డి రైల్వేకోడూరులో చెన్నై వెళ్లే రైళ్లను ఆపాలని రైల్వే ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### స్పందన అర్జీలు పరిష్కరించకుంటే చర్యలు తప్పవు

**- అధికారులను ఆదేశించిన కలెక్టర్ గిరీషా పిఎస్**



రాయచోటి, మార్చి 27ప్రభాతవార్త:

స్పందన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని అధి కారులను కలెక్టర్ గిరీషా పిఎస్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో స ్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ గిరీషా పిఎస్, జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, డిఆర్వో సత్యనారాయణ, భూముల సర్వే విభాగం సహాయ సంచాలకులు జయరామ్, జిల్లా నలుమూలల ప్రజల నుండి వచ్చిన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రజల నుంచి స్వయంగా అర్జీలు స్వీకరించి సంబంధిత అధి కారులను పిలిచి ఆ అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అధికారులందరూ కూడా బాధ్యతతో సీరియస్‌గా తీసుకొని స్పందన సమస్యలను పరిష్కరించాలన్నారు. పరిష్కారం గురించి అర్జీదా రులకు అర్థమయ్యే విధంగా పూర్తి వివరాలు ఎండార్ ్స ్మెంట్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్ర మంలో వివిధ సమస్యలపై బాధితులు వినతి పత్రాలు సమర్పించారు. ఈ సమస్యలను వెంటనే పరిష్క రించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

## గృహ నిర్మాణ లక్ష్యాలను పూర్తి చేయండి

### జగనన్న హౌసింగ్ కాలనీల నిర్మాణ పనుల్లో పురోగతి సాధించాలి

**కలెక్టర్ విజయ్ రామ రాజు**





కడప, మార్చి 27 ప్రభాతవార్త :

జిల్లాలో గృహ నిర్మాణ పథకం కింద నిర్దేశించిన పనులను సమర్థవంతంగా, త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ వి. విజయ్ రామరాజు క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభాభవన్ నుండి.. మున్సిపల్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్,ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా,డిఆర్వో గంగాధర్ గౌడ్, హౌసింగ్ పి.డి. కృష్ణయ్య లతో కలిసి.. జగనన్న హౌసింగ్ కాలనీల్లో గృహ నిర్మాణ పనుల పురోగతి,మౌలిక వసతులు, యాక్షన్ ప్లాన్ తో పాటు.. అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు తీరు, పురోగతి, తదితర అంశాలతో కూడిన ఎజెండాలపై ఆర్డీవోలు, నియోజకవర్గ స్థాయి, మండల స్థాయి, అధికారులతో జిల్లా కలెక్టర్ వి. విజయ్ రామ రాజు సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామ రాజు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టి అమలు చేస్తున్న సేవలు, సంక్షేమ పథకాలు.. ప్రజలకు సంతృప్త స్థాయిలో అందాలనే ప్రభుత్వ లక్ష్యం మేరకు.. ప్రతి ఒక్కరూ.. నిబద్ధతతో పని చేయాలన్నారు. మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు లక్ష్య సాధన కోసం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి వారం ప్రగతి నివేదికలు అందజేయాలన్నారు. ప్రధానంగా.. జగనన్న హౌసింగ్ కాలనీల నిర్మాణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని.. ఆయా మండలాలు, మున్సిపాలిటీల పరిధిలోని లే అవుట్లలో గృహ నిర్మాణ పనుల పురోగతిపై ఒక్కొక్కరిని అడిగి తెలుసుకున్నారు. లే అవుట్ పూర్తయినవి, పూర్తి కానివీ, గ్రౌండింగ్ స్టార్ట్ అయినవి,మొదలైన మెటీరియల్, ఫైనాన్స్ అసిస్టెన్స్ మొదలైన అన్ని రకాల సదుపాయాలను సమకూర్చి.. నిర్మాణ పనులను లక్ష్యం మేరకు పూర్తి చేయాలని.. ఆదేశించారు. జగనన్న గృహానిర్మాణాలలో ఎలాంటి లోటుపాట్లకు తావివ్వక పూర్తి అవగాహనతో లక్ష్యాలను అధికమించాలని అన్నారు. అధికారులు సమావేశానికి వచ్చేముందు సమగ్ర నివేదికలతో అవగాహన కలిగి రావాలన్నారు . పేదల ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి కనిపించాలని, వెనకబడితే చర్యలు తప్పవని అన్నారు.పేదల ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఇంపార్టెన్స్ ఇస్తుందనే విషయాన్ని ప్రతి ఒక్కరు దృష్టిలో పెట్టుకోని పనిచేయాలని పేర్కొన్నారు. జగనన్న గృహ నిర్మాణాలలో ముఖ్యంగా విద్యుత్, నీటి సరఫరాకు త్వరితగతిన అన్ని ఏర్పాట్లు చేయాలని చెప్పారు. గృహ నిర్మాణ శాఖ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ప్రతిరోజు సమీక్ష చేయాలన్నారు. గృహ నిర్మాణ పనుల్లో అధికారులు చిత్త శుద్దితో పనిచేసి నిర్దేశించిన, ఆశించిన పురోగతిని చూపాలని అన్నారు. అధికారులు చేసిన పనిని ఆన్ లైన్లలో నమోదు చేయాలని అన్నారు. ప్రాధాన్యత భావన నిర్మాణాల పై ప్రత్యేక దృష్టి పెట్టి పనులు పూర్తి చేయాలని అన్నారు. అలాగే ఓటరు %×ణ% కార్డు, ఆధార్ కార్డు అనుసంధానానికి సంబంధించిన ఆధార్ సీడింగ్ ను 100% పూర్తి చేయాలన్నారు.నోడల్ వైద్యాధికారులు మండల ఆరోగ్య పరిస్థితులపై పూర్తిగా అవగాహన కలిగి పనిచేయాలని ఈ సందర్భంగా సూచించారు.ఈ కార్యక్రమంలో కడప, బద్వేలు, పులివెందుల,జమ్మలమడుగు ఆర్ డి ఓ లు ధర్మ చంద్రా రెడ్డి, వెంకట రమణ, వెంకటేష్, శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులైన నియోజకవర్గ, మండల ప్రత్యేకధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడివోలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు హాజరయ్యారు.

### ప్రజలకు వేగంగా వైద్యసేవలు అందించడానికి

## అంబులెన్స్ వ్యవస్థ

**-ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి**



రాయచోటి, మార్చి 27ప్రభాతవార్త:

ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను కలెక్టర్ గిరీషా పిఎస్ ఆదేశించారు. సోమవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ య్శాఖ, ఫిర్యాదుల కొరకు జిల్లాకు కేటాయించిన రెండు 104 అంబులెన్స్ కలెక్టర్ గిరీషా పిఎస్, శాసన సభ వ్యవహారాల సమన్వయకర్త, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, రాయచోటి మున్సిపల్ ఛైర్మెన్ ఫయాజ్ బాషాలు పచ్చజెండా ఊపి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి, 104 అంబులెన్స్‌లో ఉన్న వైద్య సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా శాసన సభ వ్యవహారాల సమన్వయకర్త, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ పేదలకు మెరుగైన, వేగంగా వైద్య సేవలందించడానికే 108, 104 అంబులెన్స్ వ్యవస్థ ప్రవేశపెట్టారని, దీనికి ఆధ్యుడు దివంగత సిఎం వైఎస్. రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సిఎం జగన్ మోహన్‌రెడ్డి విద్య, వైద్యం, వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా కొత్త టెక్నాలజీతో తయారు చేసిన 104 వాహనాలు జిల్లాకు మంజూరు చేశారన్నారు. ఇప్పుడు జిల్లాకు వచ్చిన అంబులెన్స్‌ల వల్ల ప్రతి గ్రామం, పట్టణంలో ప్రజలకు ఎంతో ప్రనయోజనం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య, డిసిహెచ్ ఎస్. డాక్టర్ చంద్రశేఖర్, డిపిఎంవో లోకవర్ధన్, 104 డిస్ట్రిక్ మేనేజర్ ఎన్. ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### విభిన్న ప్రతిభావంతుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి

**కలెక్టర్ గిరీషా పి.ఎస్**



రాయచోటి, మార్చి 27ప్రభాతవార్త:

దివ్యాంగులమని నిరుత్సాహ పడకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిచ్చి, దివ్యాంగులకు ప్రత్యేక గుర్తింపును అందిస్తోందని జిల్లా కలెక్టర్ గిరీష పి.ఎస్ తెలిపారు. శనివారం రాయచోటి లోని కలెక్టరేట్ ఆవరణలో విభిన్న ప్రతిభావంతులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో "అట్టహాసంగా విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల స్కూటర్ల పంపిణీ" కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గిరీషా పి.ఎస్, శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త గడికోట శ్రీకాంత్ రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్మన్ పి. ముంతాజ్ లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా వినికిడి యంత్రాలు, ట్రైసైకిళ్లు, వీల్ చైర్లు అందిస్తోందన్నారు. ఈసారి ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి జిల్లాలో మొదటిసారిగా 57 మందికి రూ.68లక్షల ఖర్చుతో మోటోరైజడ్ స్కూటర్లను అందించడం హర్షించదగ్గ అంశం అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అందించాలని ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని చెప్పారు. విభిన్న ప్రతిభావంతులైనప్పటికీ ఇతరులతో పోటీపడుతూ అన్ని రంగాలలో ముందుకు రావడం అభినందనీయమన్నారు. రాబోయే కాలంలో అర్హులైన అందరికీ మోటారు సైకిళ్లు, బ్యాటరీ సైకిళ్లను పా రదర్శకంగా పంపిణీ చేయుటకు ప్రణాళికలు రూపొందిస్తు న్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన వికలాంగులకు రూ.3 వేల నుంచి రూ.5వేల వరకు పింఛన్లు అందజే స్తోందని, వ్యాపారం చేసుకునే వారికి రూ.5 లక్షల వరకు రుణాలు అందజేయడం జరుగుతోందని చెప్పారు. కార్యక్రమంలో శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త గడికోట శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వం అన్ని విధాలుగా చేయూత అందిస్తోందన్నారు. కేంద్రంతో మాట్లాడి విభిన్న ప్రతిభావంతులకు మోటార్ వాహనాలు రావడంలో ఎంపి మిధున్ రెడ్డి కృషి చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వం వివిధ రకాలైన ద్విచక్ర, త్రిచక్ర వాహనాలను, వినికిడి యంత్రాలు,రోలేటర్స్, వీల్ చైర్ లను ఉచితంగా అందించి దివ్యాంగులకు చేయూతనందిస్తోందని అన్నారు. అనంతరం ముఖ్య అతిథుల చేతుల మీదుగా విభిన్న ప్రతిభావంతులకు ఉచితంగా మూడు చక్రాల మోటార్ సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయ, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ భాష, వెలుగు సంస్థ వ్యవస్థాపకులు ఉదయ్, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడి కిషోర్ బాబు, విభిన్న ప్రతిభావంతులు తదితరులు పాల్గొన్నారు.

## ఆకేపాడులో 300 ఎకరాల భూ కుంభకోణం

### తీగ లాగితే డొంక కదులుతోంది

### ఇష్టారాజ్యంగా ఆన్‌లైన్‌లు చేసిన తహశిల్దారులు

ఆకేపాడు భూముల కుంభకోణానికి 'కేరాఫ్'గా మారుతోంది. వందల ఎకరాల ప్రభుత్వ భూములు ఆక్రమణదారులు చెర పట్టారు. నేతలు చెప్పిందే వేదమని కొందరు అవినీతి తహశిల్దారులు ఇష్టమొచ్చినట్లు భూములను కట్టబెట్టారు. నేతలు చెప్పినట్లు బినామి పేర్లతో రికార్డులు కూడా ఎక్కించారు. అంతటితో ఆగలేదు. ఆన్‌లైన్ కూడా చేశారు. ఇంతా జరుగుతున్నా రెవెన్యూ ఉన్నతాధికారులకు ఈ కుంభకోణం తెలియలేదు. అసైన్‌మెంట్ ముసుగులో ఈ దందా జరిగింది. 'వార్త' దినపత్రిక ప్రధాన సంచికలో సోమవారం 'వారు భూ కేటిగాళ్లు' శీర్షికన వెలువడిన కథనంపై రాష్ట్ర సిసిఎల్ఎ ఆరా తీసినట్లు తెలిసింది. ఈ కథనం ప్రచురితమైన నేపథ్యంలో మరిన్ని భూములు నేతల స్వాధీనంలోనే బినామి పేర్లతో ఉన్నట్లు సమాచారం తెలియవచ్చింది.

రాజంపేట అర్బన్, మార్చి 27 ప్రభాతవార్త

రాజంపేట మండలం ఆకేపాడు, శ్రీరంగరాజపురం, రెవెన్యూ గ్రామాల పరిధిలో ఈ భూముల కుంభకోణం జరిగింది. నేతల ఒత్తిడికి తలొగ్గి పలువురు అవినీతి తహశిల్దారులు తమ జాగీరు అన్నట్లు ప్రభుత్వ భూములను అప్పనంలా నేతలు చెప్పినట్లు రికార్డుకు ఎక్కించారు. 7వ విడత అసైన్‌మెంట్ కమిటిలో ఆమోదించిన సర్వేనంబర్లకు అటు ఇటు నంబర్లలో ప్రభుత్వ భూములను బినామి పేర్లతో కాజేసినట్లు తెలుస్తోంది. అసైన్‌మెంట్‌లో ఆకేపాడు, శ్రీరంగరాజపురం, రెవెన్యూ గ్రామాల పరిధిలో సర్వేనంబరు 1256 నుంచి 1276 వరకు 99 మందికి 145 ఎకరాల భూములను అసైన్‌మెంట్ కమిటి ఆమోదించింది. దీన్ని అడ్డుపెట్టుకొని ప్రభుత్వం ఎవరికి భూములు మంజూరు చేయకపోయినా 990, 991, 1125, 1126, 1127, 1193, 1194, 1211, 1212, 1213, 1215, 1216, 1217, 1219, 1220, 1221, 1222, 1228, 1229, 1230, 1231, 1232, 1233, 1234, 1235, 1236, 1237, 1238 సర్వేనంబర్లలో వందల ఎకరాల భూములు పలువురి పేర్లతో కొందరు అవినీతి తహశిల్దారులు రెవెన్యూ వెబ్‌ల్యాండ్‌లో ఎంట్రీ చేశారు. మరికొందరు తహశిల్దారులు ఈ ఎంట్రీలను ఏకంగా అక్రమమని తెలిసినా ఆన్‌లైన్ చేసి తమ అవినీతి ఘనతను చాటుకొన్నారు. తాజాగా అందిన సమాచారం మేరకు 1276. 1277, 1285, 1286, 1294, 1295, 1299, 1300, 1301, 1302, 1303, 1304 సర్వేనంబర్లలో సుమారు 100 ఎకరాలు పైబడి భూములు ఆక్రమించినట్లు పక్కా సమాచారం. శ్రీరంగరాజపురం ప్రాంతంలో ఏకంగా ఓ కొండకు కిలోమీటరు దూరం పైబడి పెన్సింగ్ వేశారంటే ఎంత బరి తెగించారో అర్థం చేసుకోవచ్చు. జిల్లా కలెక్టర్ గిరీషా ఒకవైపు అక్రమ భూముల కుంభకోణంపై కొరడా ఝుళిపిస్తున్నా మరోవైపు రాజంపేట మండలంలో అక్రమాలు ఇంకా ఒకదానివెంట ఒకటి బయట పడుతున్నాయి. ఇప్పటివరకు తాళ్లపాక, మన్నూరు, పోలి గ్రామాల్లో భూ అక్రమాలపై విఆర్‌ఒలపై వేటు పడగా తాజాగా ఆకేపాడు భూముల కుంభకోణంలో కొందరు తహశిల్దారులే నేరుగా ఎలాంటి రికార్డులు లేకుండా మంజూరు లేకుండా అసైన్‌మెంట్‌లో మంజూరు కాకుండానే వందల ఎకరాలు అక్రమార్కులకు పల్లెంలో పెట్టి సమర్పించడం సంచలనం సృష్టిస్తోంది. ఆకేపాడు భూముల కుంభకోణంపై అన్నమయ్య కలెక్టర్ గిరీషా ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.



శ్రీరంగరాజపురంలో కొండకే అక్రమ ఫెన్సింగ్

## జగన్ అవినీతి పాలనకు అవార్డు ఇవ్వచ్చు

### మన రాష్ట్రానికి ఇదేం ఖర్మ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్ రెడ్డి



రాయచోటి, మార్చి 27ప్రభాతవార్త:

రాష్ట్రం ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి అవినీతి పాలనకు అవార్డు ఇవ్వచ్చునని మద్యం గంజాయి ఇసుక మాఫియా వారికి జగన్మోహన్ రెడ్డి పాలన కేరాఫ్ అడ్డాగా మారిందని రాయచోటి నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ మాజీ ఎమ్మెల్యే ఆర్ రమేష్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం సంబేపల్లి మండలం శెట్టిపల్లి పంచాయతీ నరసారెడ్డి గారి పల్లె శెట్టిపల్లి కస్బా వడ్డేపల్లి హరిజనవాడలలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి రమేష్ కుమార్ రెడ్డి తిరుగుతూ జగన్మోహన్ రెడ్డి అవినీతి పాలన పై ప్రజలకు వివరిస్తూ ఆయన ముందుకు కదిలారు జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాల పేరుతో ప్రజలకు మోసం చేసి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని అన్నారు మన రాష్ట్రంలోనే అత్యధికంగా పెట్రోల్ ధరలు పెంచారని, ఏడుసార్లు కరెంటు చార్జీలు పెంచారని ఇంటి పన్ను ,చెత్త పన్నుపెంచి ప్రజలపై పెను భారంమోపరన్నరు. జగన్ పాలనలో రైతులు చితికి పోయారని వ్యవసాయం లాభసాటిగా లేకుండా చేశారని దేశంలో ఎక్కువ అప్పులు చేసిన రైతులు మన రాష్ట్రంలో ఉన్నారని ఆ రైతులు ఎందుకు అప్పుల్లో కూరకపోయారో చెప్పే ధైర్యం జగన్మోహన్ రెడ్డికి ఉందా అని రమేష్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. మద్యం నిషేధం చేస్తానని చెప్పిన జగన్ మోహన్ రెడ్డి రకరకాల బ్రాండ్ల పేరుతో ప్రజలకు మోసం చేస్తున్నారన్నారుఏ మద్యం షాప్ లో చూసిన జే బ్రాండ్ తోనే అమ్మకాలు అమ్మకాలు చేస్తున్నారని మద్యం షాపుల్లో ఎందుకు ఆన్లైన్ అమ్మకాలు జరగడం లేదన్నారు చేతకాని దద్దమ్మ పరి పాలన వల్ల పరమ పవిత్రమైన తిరుమలలో గంజాయి ఏరులై పారుతుంది తిరుమల పవిత్రతను కాపాడాలన్నారు రాష్ట్రంలో విచ్చలవిడిగా గంజాయి సరఫరా జరుగుతుందన్నారు జగన్మోహన్ రెడ్డి నాలుగేళ్ల పాలనలో ఎక్కడ కానీ శాశ్వత అభివృద్ధి జరగలేదన్నారు జనాకర్షణ పథకాలతో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకు పోయిందన్నారు జగన్ ఒక్క అవకాశం అని అధికారంలోకి వచ్చాడని ఆయనకి ఇదే చివరి అవకాశం కావాలన్నారు మళ్లీ మన రాష్ట్రానికి మంచి రోజులు రావాలి అంటే వచ్చే ఎన్నికలల్లో టిడిపిని గెలిపించి చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేయాలన్నారు. మన రాష్ట్రానికి ఇదేంకర్మ కార్యక్రమంలో రమేష్ రెడ్డి దృష్టికి సమస్యలు వెల్లువలి సంబేపల్లి మండలం శెట్టిపల్లి గ్రామంలో మనరాష్ట్రానికి ఇదేం కర్మ కార్యక్రమంలో రమేష్ కుమార్ రెడ్డి దృష్టికి వడ్డేపల్లి హరిజనవాడ ప్రజలు పలు సమస్యలను లేవనెత్తారు మా పల్లెకు సిమెంట్ రోడ్డు లేదన్నారు అధికార పార్టీ నాయకులు మీకందరికీ జగనన్న ఇల్లు ఇప్పిస్తామని చెప్పి ఉన్న ఇళ్లను పడగొట్టడం జరిగిందని అయితే తమకు తమ ఇళ్లకు బిల్లులు చెల్లించలేదని లబ్ధిదారులు రమేష్ రెడ్డి దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి తెలుగుదేశం నాయకులు మల్లు నర్సారెడ్డి, టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ మల్లు విష్ణువర్ధన్ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు నూరు ఎకరాల రంగారెడ్డి, శివారెడ్డి, వెంకటరమణ, తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## తల్లీ, ఇద్దరు పిల్లలు అదృశ్యం



కడప క్రైం, మార్చి 27, ప్రభాతవార్త:

కడప టుటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో మోచంపేటలో ప్రభుత్వ పాఠశాల వద్దకు ఈనెల 20న చేరుకున్న సయ్యద్ జరీనా (27) అనే మహిళ తన ఇద్దరు పిల్లలు సయ్యద్ హాతీమ్(12), సయ్యద్ సానియా(10లతో పాటు ఎక్కడికో వెళ్లి తిరిగి రాలేదని ఆమ తల్లి ఖదీరున్నీసా సోమవారం ఫిర్యాదు చేసింది. ముగ్గురు అదృశ్యమయ్యారని కడప టుటౌన్ సీఐ సయ్యద్ హాసం ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సయ్యద్ జరీనా తన భర్త సయ్యద్ అక్బర్‌లు చింతకొమ్మదిన్నె మండలం చెర్లోపల్లిలో నివాసం ఉంటోంది. సయ్యద్ అక్బర్ బేల్దారి మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 20న తన భర్త బంధువులు మృతి చెందారని అక్కడికి వెళ్లాలని తన సోదరుడు అన్వర్‌కకు ఫోన్ చేసి తన ఇంటికి పిలిపించుకుంది. కడప నగరంలోని మోచంపేటకు చేరుకుంది. అక్కడ తన పిల్లలు చదువుతున్న పాఠశాలకు వెళ్లి పిల్లలను తన వెంట తీసుకొని వెళ్లింది. తరువాత ఆమె ఆచూకీ తెలియరాలేదు. బంధువులందరి దగ్గర వారి ఆచూకీ కోసం విచారించారు. దీంతో వారి ఆచూకీ కనుగొనాలనీ ఆమె తల్లి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## అంగరంగ వైభవంగా ముగిసిన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

### స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

### ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలకు పూర్ణకుంభంతో స్వాగతం పలికిన కమిటీ సభ్యులు





ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలకు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు.

బద్వేలు అర్బన్, మార్చి 27 ప్రభాతవార్త :

మున్సిపాలిటీ పరిధిలోని సిద్దవటం రోడ్ త్యాగరాజు కాలనీలో నూతనంగా నిర్మాణం చేపట్టిన శ్రీ మహా గణపతి నవగ్రహ సమేత వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రమణ్య స్వామి ధ్వజ సహిత శ్రీ కాశీ విశాలక్ష్మి అన్నపూర్ణేశ్వరి సమేత శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం గత మూడు రోజుల నుండి ఆలయ కమిటీ ఛైర్మెన్ రామన బోయిన మురళి, ప్రధాన అర్చకులు సత్యనారాయణ స్వామి, గౌరవ అధ్యక్షులు వంకెల పెద్ద పోలిరెడ్డి మరియు పలువురు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సోమవారం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో ఎమ్మెల్సీ డి.సి.గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డా॥ సుధ, అర్బన్ సీఐ వెంకటేశ్వర్లు, ఏపి సివిల్ సప్లయ్స్ డైరెక్టర్ గుర్రంపాటి సుందరరామి రెడ్డి, జడ్పీటీసి వంకెల చిన్న పోలిరెడ్డి, మున్సిపల్ కన్వీనర్ ఈగ యద్దారెడ్డి, కౌన్సిలర్ దుద్దుకూరు సత్యనారాయణతో పాటు రాగిమాను ప్రతాప్ కుమార్, అట్లూరి రెడ్డెయ్య, డీలర్ బుజ్జి, హరికృష్ణ, ఓబులయ్యతో పాటు పలువురు నాయకులు స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో వేద పండితులు సాదరంగా ఆహ్వానించి స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం శాలువా, పూల మాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డి.సి.గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డా॥ సుధ మాట్లాడుతూ బద్వేలు పట్టణంలో మొట్టమొదటి సారిగా జిల్లా స్థాయిలో శ్రీ మహా గణపతి నవగ్రహ సమేత వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రమణ్య స్వామి ధ్వజ సహిత శ్రీ కాశీ విశాలక్ష్మి అన్నపూర్ణేశ్వరి సమేత శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయాన్ని అత్యంత వైభవంగా నిర్మాణం చేపట్టి మొట్టమొదటి సారిగా కనీవిని ఎరుగని రీతిలో 27 ఇంచుల స్పటిక శివలింగం భూమి మీద వేలాది సంవత్సరాలుగా మహర్నులచే సృష్టించిన శివలింగాలలోనే అత్యంత శక్తివంతమైనది, రత్నాలలోనే శక్తివంతమైనదిగా స్పటిక శివలింగాన్ని ఏర్పాటుచేసి పీఠాధిపతులు, వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం చేపట్టడం ఎంతో సంతోషకరం అన్నారు. పుర ప్రజలందరూ స్వామివారి అనుగ్రహంతో అష్టైశ్వర్య ఆయురారోగ్యాలతో ఉండాలని, ఆలయం దిన దినాభివృద్ధి చెందాలని వారు ఆకాంక్షించారు. అనంతరం స్వామివారి సన్నిధిలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వారికి కమిటీ సభ్యులు ప్రత్యేక తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## రాయచోటి మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన గంగాప్రసాద్




రాయచోటి టౌన్, మార్చి 27ప్రభాతవార్త:

అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పురపాలిక కమిషనర్‌గా సి. గంగాప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ కార్యాలయం కమిషనర్ ఛాంబర్‌లో ఆర్. రాంబాబు బాధ్యతలు అప్పగించారు. ఆర్. రాంబాబు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. గంగాప్రసాద్ గతంలో ప్రొద్దుటూరు, వెంకటగిరిలలో పనిచేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయ అధికారులు, సిబ్బంది కమిషనర్‌కి పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు అండ్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, డిఈ సుధాకర్ నాయక్, మేనేజర్ రాధ, ఎఈ కృష్ణారెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అభివద్ధి పనులను తనిఖీ చేసిన సర్పంచ్


వార్త IIIవ పేజీలో

## శివానందపురంలో కొనసాగిన ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్

కడప, మార్చి 27 ప్రభాతవార్త :




స్పెషల్ క్యాంపు రెండవ రోజులో భాగంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు శివానందపురంలోని వివిధ ప్రాంతాలలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే చెట్ల యొక్క ప్రాముఖ్యతను పరిసర ప్రాంతాలలోని ప్రజలకు వివరించడం జరిగింది విపరీతంగా పెరిగిపోతున్నటువంటి ఉష్ణోగ్రతలను తగ్గించడం లో మొక్కలు ప్రధాన పాత్రను పోషిస్తాయని మానవ మనుగడని కొనసాగించ డంలో మొక్కలు ప్రధానమైనవని ప్రతి ఒక్కరూ ప్రత్యేక దినాలలో మొక్కలు నాటే సంప్రదాయాన్ని అలవర్చుకోవాలని సూచించారు.. మొక్కలు నాటే కార్య క్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 3 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వై సావిత్రి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం

మైదుకూరు, మార్చి 27
ప్రభాతవార్త :



ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమము సోమవారము వనిపెంటలోని కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. అందులో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం వనిపెంట వారు పకృతి వ్యవసాయ రైతులకు పిఎండిఎస్ కిట్లు అందచేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిపిఎం ఏపీసీఎన్ఎఫ్ కడప పి.రామ కృష్ణ రాజు హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పియం డిఎస్ (ప్రీ మంసూన్ డ్రై సోయింగ్) కిట్ల గురించి వాటి లాభాల గురించి రైతులకు వివరించారు. అలాగే ఈ కార్యక్రమానికి పిఎఫ్ పి ఓ యం.రాజ శేఖర్ రెడ్డి హాజరై రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా పకృతి వ్యవసాయం చేసే 50 మంది రైతులకు పి.రామకృష్ణరాజు , శ్రీవిద్యా రాణి చేతుల మీదుగా పియండిఎస్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి కె.వి.కె శాస్త్రవేత్త (విస్తరణ విభాగం) మరియు అధినేత డా.యన్. శ్రీవిద్య రాణి తో పాటు వృత్తిక విభాగము శాస్త్రవేత్త డా.యం. హర్షిత, ఉద్యాన శాస్త్రవేత్త ఎస్.ఫిరోజ్ ఉషెన్, గృహ విజ్ఞాన విభాగం శాస్త్రవేత్త డా. బి.ఎస్. క్రాంతిశ్రీ పాల్గొన్నారు.

## తిరుమలలో గంజాయి రామరామ..

**- టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసులురెడ్డి**

కడప వైద్యవిభాగం, మార్చి 27, ప్రభాతవార్త:



వైసీపీ ప్రభుత్వం తిరుమలని కూడా అపవిత్రం చేస్తోందని తెదేపా పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసులురెడ్డి అన్నారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.ఆరు నెలలుగా రాష్ట్రంలో గంజాయి అక్రమ రవాణా విస్తరించిపోతోందని ఆఖరికి తిరుమలలో కూడా గంజాయిని పట్టుకున్నారంటే కింద నుంచి పైకి ఏ విధంగా వస్తొందని ఎవరూ పోషిస్తున్నారో తెలియాలన్నారు. ప్రభుత్వ పెద్దల హస్తాలు ఉన్నాయంటూ అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గంజాయిపైన పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేసి సీబీడీ వేయాలని డిమాండ్ చేశారు. అక్రమ గంజాయి రవాణాకు పాల్పడుతున్న దోషులను కఠినంగా శిక్షించాలి. గంజాయి వల్ల దేశం నాశనం అయ్యేందుకు ఏపీనే కారణమవుతోందని మండిపడ్డారు.

## మోదీ దుర్మార్గపు కక్ష సాధింపు చర్యలను ఖండిస్తున్నాం

**- రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు మల్లెం విజయభాస్కర్**

కడప వైద్యవిభాగం, మార్చి 27, ప్రభాతవార్త:



రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయడం సిగ్గుచేటు. పార్లమెంటులో ప్రశ్నించే గొంతు ఉండకూడదని ఈ విషయంలో బీజేపీ నరేంద్ర మోదీ తీసుకున్న నిర్ణయం దుర్మార్గపు చర్య అని రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు మల్లెం విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. మన భారతదేశం ప్రజాస్వామ్యమని ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికి ఉందని ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజా నాయకుడు ప్రజాధరణ కలిగిన రాహుల్ గాంధీ ఎదుగుదలను చూసి ఓర్వలేక కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం దుర్మార్గమన్నారు. భారతదేశ ప్రజలు గమనిస్తున్నారని మోదీ దుర్మార్గ చర్యలకు దేశ ప్రజలు చరమగీతం పాడే రోజులు దగ్గరలో ఉందన్నారు. భారతదేశాన్ని కాపాడుకోకపోతే దేశం ప్రమాదంలో పడే పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికే కుల, మత, ఆర్థిక, విదానాలతో దేశ ఆర్థిక పరిస్థితి క్షీణించి పోయింది. రాహుల్ గాంధీ భారతదేశాన్ని కాపాడడం కోసం గతంలో కొన్ని విషయాలపై ప్రశ్నించారు. మోదీ మాయాజాలం చూస్తే ఈ దేశ సంపదను కార్పొరేట్ సంస్థల పెత్తందారులకు దారాదత్తం చేస్తున్నాడన్నారు. ఆదాని, అంబానీ ఇలా ఎంతో మంది భారతదేశ ప్రజాధనాన్ని దోచేస్తున్నారన్నారు. రాహుల్ గాంధీకి రెండు సంవత్సరాలు శిక్ష వేసిందని దాన్ని సాకు చూపించి రాహుల్ గాంధీ గొంతు నొక్కడం దుర్మార్గ చర్య అన్నారు.

## అచ్చన్న మృతిపై సమగ్ర విచారణ జరగాలి

**- కాంగ్రెస్ కడప జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు**



కడప వైద్యవిభాగం, మార్చి 27, ప్రభాతవార్త:

పశువైద్యశాల డీడీగా పని చేస్తున్న దళితుడైన అచ్చన్న మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని, దీనిపై సమగ్ర విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షులు నీలి శ్రీనివాసరావు అన్నారు. బడుగు, బలహీన వర్గాల దళితులకు ఉద్యోగాలు చేస్తున్నా రక్షణ కరవైందన్నారు. కాంగ్రెస్ పార్టీగా అచ్చన్న మృతిపై తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వారి కుటుంబ సభ్యుల ఆరోపణల మేరకు కచ్చితంగా విచారణ వేగవంతం చేసి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా జిల్లా ఎస్పీ కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అచ్చన్న మృతిపై వెంటనే పోలీసు శాఖ వివరణ ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో కలెక్టరేట్ వద్ద అచ్చన్న కుటుంబ సభ్యులతో కలిసి ధర్నా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావుతో పాటు నగర అధ్యక్షుడు విష్ణుప్రీతంరెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్యామలా దేవీ, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మామిళ్ల బాబు, ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు ఆనంద్, సూర్యుడు తదితరులు పాల్గొన్నారు.

## పోషణ పక్వాడా వారోత్సవాలు

ఖాజీపేట, మార్చి 27
ప్రభాతవార్త :



ఖాజీపేట మండలంలోని ముత్తు లూరుపాడు సెక్టారు, ముత్తులు రుపాడు గ్రామం మరియు ఖాజీపేట లో సూపర్వైజర్ జె.శ్రీదేవి, బాగ్యలత అధ్వర్యంలో పోషణ పక్వాడా ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది. దీని ముఖ్య ఉద్దేశం గర్భవతులు బాలింతలు ఆరు సంవత్సరాల లోపు పిల్లలు, కిశోర బాలికల్లో పోషక లోపాన్ని అరికట్టడానికి పోషణ పక్వాడ అనే ప్రోగ్రాం అమలు చేయడం జరిగింది. ప్రతి సంవత్సరం మార్చిలో 15 రోజులు పాటు పోషణ పక్వాడా ఉత్సవాలు జరపడం జరుగుతుంది మూడు థీమ్స్ అమలు చేయడం జరిగింది వాటిలో ఒకటి పోషకాహార శ్రేయస్సు కోసం మిల్లెట్స్ ను ప్రచారం చేయడం రెండు స్వస్థ బాలకే బాలిక స్వర్థ వేడుక మూడు సాక్ష్యం అంగన్వాడీలు ఈ మూడు రకాల థీమ్స్ పోషణ పక్వాడ ప్రోగ్రాం జరపడానికి ప్రభుత్వం ఒక క్యాలెండర్ విడుదల చేయడం జరిగింది. స్థానిక సాయి తేజ స్కూల్ నందు అంగన్ వాడి వర్కర్ సుభాషిణి ,సాయి కుమారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు శుభ్రత , పరిశుభ్రత పాటించినప్పుడు రోగాలు మన దరిదాపులకు కూడా రావన్నారు. కార్యక్రమంలో బాలింతలు, అంగన్వాడి టీచర్లు , గర్భవతులు పిల్లలు పాల్గొన్నారు.

## పెద్దశెట్టిపల్లెలో అభివద్ధికార్యక్రమాలను ప్రారంభించిన ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు, మార్చి 27
ప్రభాతవార్త :



ప్రొద్దుటూరు మండలం పెద్ద శెట్టి పల్లె గ్రామంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి అలా అభివృద్ధి కార్యక్రమాలను సోమవారం ప్రారంభించారు ముస్లిం సోదరులు అత్యంత పవిత్రంగా ప్రార్థన జరుపుకునే ఈదుగా మైదానం సుమారు పది లక్షల నిధులతో అభివృద్ధి చేసి సోమవారం ప్రహరీ గోడ ఆయన ప్రారంభించారు అలాగే గ్రామంలో సచివాలయ కార్యాలయం నాకు నిర్మించిన నూతన భవనం ను ఆయన ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటికే అనేక సచివాలయ నూతన భవనములు నిర్మించామన్నారు అత్యంత పవిత్రంగా భావించే ముస్లిం సోదరులకు దీర్ఘ మైదానం అభివృద్ధిపరిచి ప్రహరీ గోడను ప్రారంభించడం సంతోషకరమన్నారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ సుధాకర్ రెడ్డి వైసీపీ నాయకులు కసిరెడ్డి మహేశ్వర్ రెడ్డి స్థానిక వైసీపీ నాయకులు అధికారులు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీపై అనర్హత వేటు ప్రజాస్వామ్యానికి విరుద్ధం

**కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నజీర్ అహ్మద్ ఆగ్రహం**

ప్రొద్దుటూరు, మార్చి 27
ప్రభాతవార్త :



కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వం పై అనర్హత వేటు వేయడం బిజెపి ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలలో భాగమేనని ప్రొద్దుటూరు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నజీర్ అహ్మద్ ఆగ్రహం వ్యక్తం చేశారు సోమవారం స్థానిక గాంధీ రోడ్డులోని గాంధీ విగ్రహం దగ్గర కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆయన నిరసన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి కక్ష రాజకీయాల వల్ల ప్రజాస్వామ్యం దేశంలో ప్రమాదంలో పడిందన్నారు. బిజెపి నాయకులకు రాహుల్ గాంధీ ఒబియా వెంటాడుతోందని విమర్శించారు రాహుల్ గాంధీ ఒక చీకటి రోజుగా ఆయన అభివర్ణించారు దేశంలో నిరవ మోడీ లలిత్ మోడీ దొంగలన్న యదార్థం ప్రపంచమంతటా తెలుసని పేర్కొన్నారు బిజెపి నాయకుల తాటాకు చప్పులకు కాంగ్రెస్ పార్టీ భయపడదని న్యాయపోరాటం ప్రజా పోరాటం చేస్తుందన్నారు వినాశకాలే విపరీత బుద్ధి అన్న పెద్దల సామెతను ఆయన గుర్తు చేస్తూ అంతిమ విజయం కాంగ్రెస్ పార్టీ దేనిని ఈమా వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహిళలు పాల్గొన్నారు.

## మహిళలతోనే వైసిపికి మళ్లి అధికారం

**ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి**



ప్రొద్దుటూరు, మార్చి 27 ప్రభాతవార్త :

రాష్ట్రంలో పేదరికమే ప్రామాణికంగా మహిళా సాధికారత దిశగా వైసిపి ప్రభుత్వం నిలిచిందని మహిళల వల్లే వైసీపీ తిరిగి అధికారం చేపడుతుందని మహిళలే మా ధైర్యమని ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక అని మెసేజ్ పెట్టు మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు అధ్యక్షతన 3వ వార్డు నుండి 13 వ వార్డులకు సంబంధించిన డ్వాక్రా మహిళల కు వైయస్సార్ ఆసరా పథకం ద్వారా డ్వాక్రా రుణమాఫీ మూడవ విడత పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటికే రెండు విడతలు డ్వాక్రా రుణమాఫీ జరిగిందని మూడవ విడత పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టడం అభినందనీయమన్నారు ప్రొద్దుటూరు నియోజకవర్గంలో పట్టణ పరిధిలో మూడు విడుదలలో సుమారు 160 కోట్లు డ్వాక్రా రుణమాఫీ జరిగిందన్నారు. మూడవ విడతగా నియోజకవర్గంలో 32 కోట్ల 55 లక్షలు మంజూరు చేసి నేరుగా డ్వాక్రా మహిళల ఖాతాలలో జమ చేస్తున్నామన్నారు అంతేకాకుండా రుణాలకు సంబంధించిన వడ్డీ ఎప్పటి కప్పుడు మహిళల ఖాతాలలో జమచేస్తున్నామన్నారు వైయస్సార్ చేయూత కింద మహిళలకు పదివేల రూపాయలు రుణం మంజూరు చేస్తున్నామన్నారు గత చంద్రబాబు ప్రభుత్వానికి ప్రస్తుత జగన్ ప్రభుత్వానికి వ్యత్యాసం గమనించాలని మహిళలకు విజ్ఞప్తి చేశారు. డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని మహిళలకు వాగ్దానం చేసి మోసం చేశారన్నారు. రాష్ట్రంలో మహిళా సాధికారిత దిశగా మహిళలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ని తిరిగి గెలిపించుకునే బాధ్యత ప్రజలపై ఉందన్నారు. చైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు మాట్లాడుతూ మహిళలకు మంచి చేసే ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలో కి తెచ్చుకునే బాధ్యత మనపై ఉందన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి తిరిగి అధికారం చేపడితేనే మహిళలకు మరింత మేలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ పాతకోట బంగారు మునిరెడ్డి అసిస్టెంట్ కమిషనర్ రంగస్వామి, మెప్మా అధికారి రమణా రెడ్డి, పట్టణ అధ్యక్షులు కామిశెట్టి బాబు కౌన్సిలర్లు వరికూటి ఓబులరెడ్డి జయంతి గుర్రం లావణ్య రావుల శాంతి సత్యం గరిటపాటి లక్ష్మీదేవి ఇర్ఫాన్ భాష వార్డు వైసిపి ఇన్చార్జిలు కసిరెడ్డి మహేశ్వర్ రెడ్డి హనీఫ్ మరియు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

## ముద్దనూరు సిఐగా నరేష్ బాబు

ముద్దనూరు, మార్చి 27 ప్రభాతవార్త :



ముద్దనూరు సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా నరేష్ బాబు సోమవారం బాధ్యతలను స్వీకరించారు. నంద్యాలలో ట్రాఫిక్ సిఐ గా విధులు నిర్వహిస్తూ ఉండిన ఈయన ముద్దనూరు కు బదిలీ అయి వచ్చి సిఐగా సోమవారం బాధ్యతలు చేపట్టారు.గతంలో ఇక్కడ సిఐ గా ఉండిన మోహన్ రెడ్డి కర్నూలు జిల్లాకు బదిలీ అయిన విషయం తెలిసిందే.

## కార్మిక, కర్షక ఢిల్లీ పోరాట ప్రదర్శనను జయప్రదం చేయాలి - సీఐటీయూ

జమ్మలమడుగు, మార్చి 27, ప్రభాతవార్త:

ఏప్రిల్ 5న జరిగే చలో ఢిల్లీ కార్మిక కర్షక పోరాట ప్రదర్శనను జయప్రదం చేయాలని జమ్మలమడుగు సీఐటీయూ అంగన్‌వాడీ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, కమిటీ సభ్యులు దాసరి విజయ్‌లు స్థానిక సీడీపీవో కార్యాలయం వద్ద కరపత్రాలను విడుదల చేశారు. చాలా కాలం నఉంచి కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్‌లకు కనీస వేతనం రూ.26వేలు వేతనం, పెన్షన్ రూ.10వేలు టైం స్కేలును అందజే యాలన్నారు. మోదీ ప్రభుత్వం పట్టించుకోలేదని గత ఐదు సంవత్సరాలలో 28,572 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. కావునా వీటన్నింటిపై కలిసి పోరాడేందుకు ఏప్రిల్ 5న జరిగే ఢిల్లీ కార్మిక కర్షక పోరాట ప్రదర్శన కార్య్ర కమాన్ని జయప్రదం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వినయ్‌కుమార్, నాయుడు, దేవిడ్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడిపై కేసు

కడప క్రైం, మార్చి 27, ప్రభాతవార్త:

కడప నగరంలోని చిన్నచౌకు పోలీసు స్టేషన్ పరిధిలో కొండాయపల్లిలో ప్రభుత్వ పాఠశాల సమీపంలో శివానందపురానికి చెందిన ఈరి నరసింహులు అనే యువకుడు ఆ మార్గంలో వెళ్తున్న మహిళలు, విద్యార్థినిల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. తన ద్విచక్ర వాహనంపైనే కూర్చునో వెకిలి చేష్టలకు పాల్పడుతూ వచ్చే పోయే వారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో స్థానిక బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై అమర్‌నాథ్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## జంగాలపల్లి ఇసుక రీచ్‌లో నిబంధనలు ఎక్కడ

**- నిరసన చేస్తున్న గ్రామస్థులతో సంఘీభావం తెలిపిన టీడీపీ శ్రేణులు**

సిద్దవటం, మార్చి 27,
ప్రభాతవార్త:



జంగాలపల్లి ఇసుక రీచ్‌లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ ఇసుక మాఫియాను అరికట్టాలని గ్రామస్థులు నిరసన తెలపడంతో తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్యాల చంగల్ రాయుడు, మండల టీడీపీ శ్రేణులు సంఘీభావం తెలిపి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న జంగాలపల్లి ఇసుక రీచ్‌ను రద్దు పరచాలని డిమాండ్ చేశారు. ఇసుక నిర్వాహకులను అనుమతి పత్రాలను చూపించాలని కోరినా ఎటువంటి పత్రాలు చూపించకపోవడంతో ప్రభుత్వ అనుమతులు లేకపోతే తక్షణమే ఇసుక రీచ్‌ను రద్దు పరచాలని నిరసన తెలపడమే కాకుండా ఇసుక రీచ్ నందు ఎటువంటి ప్రభుత్వ నిబంధనలు అనుసరించకుండా సమయపాలన కూడా పాటించకుండా ఇష్టం వచ్చినట్లు ఇసుకను సుమారు 15 మీటర్ల లోతు తవ్వారని, ప్రభుత్వ నిబంధనలు ప్రకారం 18 టన్నుల అనుమతి ఉన్న టిప్పర్లలో 34 నుంచి 36 టన్నుల వరకు ఇసుకను వేసి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తూ అక్రమార్జనకు తెరదీశారని ఆరోపించారు. పరిసర ప్రాంతాల వారు, గ్రామస్థులు, మహిళలు, పిల్లలు, వృద్ధులు, ఎన్నో ప్రమాదాలకు గురై గాయపడి, మృతి చెందినా ప్రభుత్వ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. టెండర్ల కాల పరిమితి ముగిసినా అక్రమ రూపంలో ఇసుకను తరలిస్తున్నారని ఇలాగే కొనసాగితే న్యాయస్థానాలను ఆశ్రయించాల్సి వస్తుందని హెచ్చరించారు. అలాగే ప్రభుత్వ నిబంధనలుమేరకే కాంట్రాక్టర్ స్థానిక ప్రజలకు ఇబ్బంది లేకుండా ఇసుకను వేరే మార్గాన్ని ఏర్పరచుకొని ప్రభుత్వ నిబంధనల మేరకే కాంట్రాక్టరు స్థానిక ప్రజలకు ఇబ్బంది లేకుండా ఇసుకను వేరే మార్గాన్ని ఏర్పరచుకొని ప్రభుత్వ నిబంధనలకు లోబడి తీసుకెళ్లాలని సూచించారు. లేనిపక్షంలో తెదేపా తరుపున జంగాలపల్లి గ్రామ ప్రజలకు తమ పూర్తి మద్దతుతో నిరసనలు చేపడతామని హెచ్చరించారు. విషయాన్ని తెలుసుకున్న సిద్దవటం ఎస్సై తులసీ నాగప్రసాద్, ఒంటిమిట్ట సీఐ పురుషోత్తం రాజులు, స్థానిక ప్రజలకు సర్ది చెప్పి శ్రీరామనవమి వెళ్లి వచ్చిన వెంటనే ఇసుక రీచ్‌దారులకు అనుమతి లేకుంటే ఇసుక క్వారీని మూసివేసి ప్రజలకు తగు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు నిరసన విరమించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోహన్‌రెడ్డి, దశరథ రామానాయుడు, పుత్తా రామచంద్రయ్య, నాగమునిరెడ్డి, మాజీ సర్పంచ్ రాజశేఖర్ యాదవ్, గంజి సుబ్బరాయుడు, మండలంలోని తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పదో తరగతి మోడల్ పరీక్ష విజయవంతం

కడప ఎడ్యుకేషన్, మార్చి 27, ప్రభాతవార్త:

రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు కడప నగరంలో ప్రభుత్వ మున్సిపల్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు మోడల్ పరీక్ష సోమవారం నిర్వహించారు. ఈ సందర్భందగా ప్రశాంత్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు భయాందోళనకు గురి కాకుండా పదో తరగతి పరీక్షలకు హాజరుకావాలని ఆయన అన్నారు. అనంతరం ఆర్ఎస్‌యూ ఈ మోడల్ టెస్ట్ పరీక్ష ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ పరీక్ష వంద మార్కులకు బిట్లు రూపంలో అన్ని సబ్జెక్టులు సంబంధించి ఉంటుందని ఈ పరీక్ష రాయడం వలన విద్యార్థులకు ఎంతో ఉపయోగపడఉతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ నాయకులు హరి, సుకుమార్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సుఖ వ్యాధులపై కోటకొండలో వైద్య శిబిరం

తంబళ్లపల్లె, మార్చి 27, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె మండలం కోటకొండ తండాలో కృషి సంస్థ ఆధ్వర్యంలో వైద్య శిబిరంతో పాటు అవగాహన కార్యక్రమం జరిగింది. సోమవారం హెచ్ఐవీ, టీబీ, సుఖ వ్యాధులపై ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాసులు వ్యాది ఎలా సంక్రమిస్తుంది. వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలు గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అదే విధంగా క్యాన్సర్ గురించి స్క్రీనింగ్ మరియు హెచ్ఐవీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృషి సంస్థ ఓఆర్‌డబ్ల్యూ సావిత్రి, కళావతి, రహీం, ఏఎన్ఎం వసంత, పీఈ ఎస్.నాగరాణి, ప్రజలు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణకు వెంటనే చట్టబద్ధత కల్పించాలి

**- ఎంఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిన్న**

తంబళ్లపల్లె, మార్చి 27, ప్రభాతవార్త:

ఎస్సీ వర్గీకరణకు కేంద్ర ప్రభుత్వం వెంటనే చట్టబద్ధత కల్పించాలని ఎమ్మెఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డి.చిన్న డిమాండ్ చేశారు. సోమవారం ఎం.ఎస్.పి. వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు వర్గీకరణపై మాట ఇచ్చి తప్పిన బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టిన మహాసంగ్రామం పాదయాత్ర పెద్దమండెంలో ప్రారంభించి నేడు తంబళ్లపల్లి మండలంలో ప్రవేశించింది. ఈ సందర్భంగా చిన్న మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై పలు రాష్ట్రాల ముఖ్యమంత్రిలు ఆమోదం పార్లమెంటుకు పంపిన కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. వర్గీకరణ సాధన కోసం ఈనెల 31న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడి, ఏప్రిల్ 4న విజయవాడ నగరాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ మండల కన్వీనర్ వేట మల్లికార్జున, రెడ్డప్ప, కదిరి నరసింహులు, రవి, మారెప్ప, రెక్కల కొండ రామ్మోహన్, లక్ష్మయ్య, విద్యార్థులు వేట భాను ప్రకాష్, వేణు, గణేష్, ప్రణయ్‌లు పాల్గొన్నారు.

## ఒంటిపూట బడులు ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

**డిప్యూటి తహసీల్దార్ మనోహర్‌రెడ్డికి పిడియస్‌యు వినతిపత్రం**

ప్రొద్దుటూరు అర్బన్, మార్చి 27,
ప్రభాతవార్త:



రాష్ట్రవ్యాప్తంగా ఎండలు తీవ్రత దృష్ట్యా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఒంటిపూట బడులు ఇంతవరకు ఇవ్వకపోవడం దుర్మార్గమైన చర్యని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడియస్‌యు ఆధ్వర్యంలో సోమవారం ప్రొద్దుటూరులో స్పందనలో డిప్యూటీ తహశీల్దార్ మనోహర్రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పిడియస్‌యు జిల్లా కార్యదర్శి ఓ.నాగేంద్రబాబు, ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షులు విగ్నేష్ మాట్లాడుతూ.. ప్రతి విద్యా సంవత్సరం పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రతి ఏటా మార్చి 15వ తేదీ నాడు ఒంటి పూట బడులు ప్రారంభమవుతాయని కానీ ప్రస్తుతం ఇంతవరకు ఇవ్వకపోవడం దుర్మార్గమైన చర్యని ఎండలు తీవ్రంగా ఉన్నాయని పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఉక్కపోతుకు గురవుతున్నారని రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అందరికీ ఒంటి పూట బడులు ఇచ్చేటట్లు చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

## ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు - వ్యక్తి మృతి

చిన్నమండెం, మార్చి 27
ప్రభాతవార్త :



మండల పరిధిలోని కేశాపురం గ్రామం సుబ్బారెడ్డి మామిడి తోపు సమీపంలో రాయచోటి మదన పల్లి ప్రధాన రహదారిలో సోమవారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న సంఘటనలో నరసింహులు మను వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు ఏ పి 39 బి వై 0405 నంబరుగల కారు మదనపల్లె వైపునుండి రాయచోటి వైపు వస్తున్న సమయంలో నరసింహులు అనువ్యక్తి గుర్రంకొండ వైపు వెళుతుండగా కారు ఢీకొంది .ఈ ప్రమాదంలో నరసింహులు అక్కడికక్కడే మృతి చెందాడు.ఏ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుమనట్లు యస్ ఐ రమేష్ బాబు తెలిపారు.

## గ్రూప్-1 మెయిన్స్ గడువు పొడిగించాలి

**- టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంటు అధ్యక్షులు పోలి శివకుమార్**

రాయచోటి రూరల్, మార్చి 27,
ప్రభాతవార్త:



త్వరలో జరగనున్న ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల కోసం మూడు నెలలు అదనంగా సమయం కేటాయించాలని తెదేపా అనుబంధ విద్యార్థి విభాగం టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంటు అధ్యక్షులు పోలి శివకుమార్ పేర్కొన్నారు. సోమవారం స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టరు పి.ఎస్.గిరీషకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పోలి శివకుమార్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం తమ డిమాండ్లను పట్టించుకోకపోతే టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఏపీపీఎస్సీ కార్యాలయం ముట్టడింపజేసేందుకు వెనకాడబోమని హెచ్చరించారు. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష క్వాలీఫై అయిన అభ్యర్థులు ప్రిపరేషన్ కోసం కనీసం అంటే 85 రోజులు గడువును మాత్రమే ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. నిరుద్యోగుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని గడువు పెంచాలని టీఎన్ఎస్ఎఫ్ ద్వారా డిమాండ్ చేస్తున్నామన్నారు. మెయిన్స్‌లో ఏడు పేపర్లు ప్రిపేర్ చేయడానికి ఈ సమయం ఏమాత్రం చాలదన్నారు. కొత్త అభ్యర్థులే కాకుండా ప్రస్తుతం ఉద్యోగాలు చేస్తున్న వారు కూడా గ్రూప్-1 పరీక్షలు రాస్తున్నారని అందువల్ల ప్రభుత్వం సానుభూతితో ఆలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంటు ఉపాధ్యక్షులు కటారి శివ యాదవ్, నియోజకవర్గ అధ్యక్షులు నీలం దేవేంద్ర ప్రసాద్, నియోజకవర్గ నాయకులు సుధాకర్,అనిల్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## కార్పెంటర్స్‌డే సందర్భంగా ఉచిత గుండె వైద్య నిర్ధారణ శిబిరం

కడప వైద్యవిభాగం, మార్చి 27,
ప్రభాతవార్త:



కార్పెంటర్స్‌డే సందర్భంగా సోమవారం జిల్లా పరిషత్‌లో కడప నగర కార్పెంటర్ సంక్షేమ సంఘం రోటరీ క్లబ్ ఆఫ్ ఆఫ్ కడప, సువర్ణ భారతి చారిటబుల్ ట్రస్ట్ అరుణాచలం ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య నిర్ధారణ శిబిరం జరిగింది. 200 మంది ఉచిత గుండె వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారిలో ఏడు మందికి గుండె వ్యాధి సంబంధించిన లక్షణాలు ఉన్నట్లు పరీక్షల్లో తేలింది. వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్ వారణాసి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో షుగరు, బీపీ, గుండె వ్యాధులకు సంబంధించిన అవగాహన కలిగి ఉండాలని దైనందిన జీవితంలో వ్యాయామం ఆహార నియమాలు ఒత్తిడి లేని జీవితం గడపాలని ఎటువంటి జబ్బులు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన జిల్లా పరిషత్ చైర్మన్ అమర్‌నాథ్‌రెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి వైద్య శిబిరాలు చాలా నిర్వహించాలని వ్యాధిని రాకుండా కాపాడుకోవాలని రోటరీ క్లబ్ వారు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో రోటంరీ క్లబ్ అధ్యక్షులు నితీష్ కుమార్‌రెడ్డి, సెక్రటరీ అమర్‌నాథ్‌రెడ్డి, కార్పెంటర్ అసోసియేషన్ నిమ్మకంటి వీరబ్రహ్మయ్య, సెక్రటరీ పెన్నె మధు తదితరులు పాల్గొన్నారు.

## దళిత వ్యతిరేక బిల్లును ఉపసంహరించుకోవాలి

కడప కార్పొరేషన్, మార్చి 27,
ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రభుత్వం ఒక మతాన్ని ప్రోత్సహించే విధంగా మాత మార్పిడిలకు ఊతమిస్తుందని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు దబ్బుల వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చలపతిరావు, జిల్లా కార్యదర్శి అనంత కేశవ, సీనియర్ నాయకులు హరినారాయణలు ఆరోపించారు. ఏకపక్షంగా రాజ్యాంగంలో లేని దళిత క్రిస్టియన్ల అనే పదాన్ని చేర్చి అసెంబ్లీలో ప్రవేశపెట్టిన దళిత వ్యతిరేక బిల్లును ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం కడప కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బిల్లు డా.బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగానూ నిజమైన దళితులను అణగదొక్కే విధంగానూ, నిజమైన దళితులను అణగదొక్కే విధంగానూ అన్యాయం చేసే విధంగా ఉందని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా జనరల్ సెక్రటరీ కె.లక్ష్మినారాయణరెడ్డి, ఉపాధ్యక్షులు సతీష్‌చంద్ర, స్వచ్ఛ భారత్ కన్వీనర్ లక్ష్మణరావు, నాయకులు రామసుబ్బయ్య, శ్రీదర్, ప్రభుకుమార్, ప్రకాశం, దేవ ప్రసాద్ రావు, గుడుగునూరు కృష్ణ, చంద్రమోహన్, రాంప్రసాద్ పాల్గొన్నారు.

## పార్టీ వ్యతిరేక చర్యలను ఉపేక్షించేది లేదు

కడప కార్పొరేషన్, మార్చి 27,
ప్రభాతవార్త:



పార్టీ విధానాలకు వ్యతిరేకంగా శాసన మండలి ఎన్నికలలో క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిన నలుగురు శాసన సభ సభ్యులపై క్రమశిక్షణ చర్యలు పార్టీ పెద్దలు తీసుకోవడం జరిగిందని సోషల్ వెల్ఫేర్ కార్పొరేషన్ ఛైర్మన్ పులి సునీల్‌కుమార్ అన్నారు. రెడ్డి సామాజిక వర్గం చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలను ఒక దళిత ఎమ్మెల్యేపై పార్టీ సస్పెన్షన్ చేసిందన్నారు. దళిత మహిళలకు అన్యాయం చేశారని ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి మొసలి కన్నీరు కారుస్తోందన్నారు. ఒక దళిత మహిళ ఎమ్మెల్యే అయినా నాపై చర్యలు తీసుకోవడం ఏమిటని ఆమె మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి దళితులకు పెద్దపీట వేస్తున్నారని కొనియాడారు. దళితులను మంత్రులు, ఉప ముఖ్యమంత్రిలను చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు ప్రోత్సాహంతోనే ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడిందని విమర్శించారు. ఇటువంటి చర్యలను పార్టీ పెద్దలు ఉపేక్షించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైకాపా ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు సీహెచ్ వినోద్‌కుమార్, ఎస్సీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షులు చిగురుపాటి త్యాగరాజు, మార్కెట్ యార్డు డైరెక్టర్ పల్లెంకొండు సంపత్‌కుమార్, నాయకులు లక్ష్మీనారాయణ, సునీల్, శాంసన్, భరత్ పాల్గొన్నారు.

## వీరబల్లిలో జగనాసుర రక్త చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించిన టిడిపి ఇన్‌ఛార్జ్ బత్యాల



వీరబల్లి, మార్చి 27ప్రభాతవార్త:

వీరబల్లి మండల కేంద్రంలో సోమవారం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బత్యాల చెంగల్రాయులు జగనాసుర రక్త చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన బస్టాండ్ నుండి గడికోట బస్టాఫ్ వరకు ర్యాలీగా వెళ్తూ స్థానికులకు జగవాసుర రక్త చరిత్ర పుస్తకాలను పంపిణీ చేసి వైఎస్. వివేకానందరెడ్డి హత్య గురించి వివరించారు. బాబాయ్ హత్యలో అబ్బాయిల పాత్ర ఉందనేది అందరికీ తెలిసిన విషయమేనన్నారు. వివేకానంద రెడ్డిని అత్యంత దారుణంగా గొడ్డలితో నరికి చంపి గుండెపోటుగా చిత్రీకరించి తప్పించుకోవాలని చూశారన్నారు. అయితే వైఎస్. వివేకానందరెడ్డి కుమార్తె సునీత న్యాయస్థానంలో న్యాయపోరాటం చేయడం వల్ల వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు ఎం. భానుగోపాల్‌రాజు, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ వెంకటరమణ నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి తోళ్ళ సురేంద్ర, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గృహ ప్రవేశాలకు సిద్ధంగా 5వేల ఇండ్లు

హౌసింగ్ ఈఈ రామస్వామిరెడ్డి

మదనపల్లె, మార్చి 27 ప్రభాతవార్త :



జగనన్న లేవుట్లలో గృహప్రవేశాలకు 5137ఇండ్లు సిద్ధంగా ఉన్నాయని గృహనిర్మాణశాఖ మదనపల్లె ఇన్‌చార్జ్ ఈఈ ఏ.రామస్వామిరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన హౌసింగ్ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ మదనపల్లె అర్బన్ పరదిలో 5706ఇండ్లు మంజూరు కాగా వీటిలో 1559ఇండ్లు పూర్తి అయ్యాయన్నారు. రూరల్ మండలంలో 4607ఇండ్లు మంజూరు కాగా వీటిలో 1414ఇండ్లు పూర్తి అయ్యాయన్నారు. నిమ్మనపల్లె మండలంలో 2109ఇండ్లుకు గానూ 1223ఇండ్లు పూర్తి అయ్యాయన్నారు. రామసముద్రం మండలంలో 2057ఇంట్లు ఉండగా 941ఇండ్లు పూర్తి అయ్యాయన్నారు. పూర్తి అయిన ఇండ్లను ప్రభుత్వం ప్రకటించిన తేదీల్లో ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఆధ్వర్యంలో గృహప్రవేశాలు చేయడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో 14479ఇండ్లు మంజూరు కాగా ఇంకా 222ఇండ్లు పూర్తిగా ప్రారంభానికి నోచుకోలేదన్నారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు జగనన్న లేవట్లలో ఇండ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు.

# వేసవి దాహార్తి తీర్చడానికే చలివేంద్రాలు

మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనూజారెడ్డి

మదనపల్లె, మార్చి 27 ప్రభాతవార్త :



పట్టణంలో ప్రజల వేసవి దాహార్తి తీర్చడానికే చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనూజారెడ్డి తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం ఆవరణంలో చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రధాన కూడలి ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఆర్టీసి బస్టాండు, ఎన్‌టిఆర్ సర్కిల్, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, చిత్తూరుబస్టాండు, బెంగుళూరు బస్టాండు, నిమ్మనపల్లె సర్కిల్, సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వేసవికి కూల్ వాటర్ క్యాన్లల్లో చల్లని నీటిని చలివేంద్రాల్లో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ప్రమీళ, డిఈ శిరీష, ఏఈ స్నేహప్రియ,కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# స్పందనా సమస్యల పరిష్కారానికి చర్యలు

సబ్‌కలెక్టర్ ఎంఎస్.మురళి

మదనపల్లె, మార్చి 27 ప్రభాతవార్త :



స్పందనాలో ప్రజలు విన్నవించే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆర్డీఓ ఎంఎస్.మురళి తెలిపారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్పందనా కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని 11 మండలాలకు చెందిన ప్రజలు పలు సమస్యలపై స్పందనలో విన్నవించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ప్రజలు విన్నవించిన సమస్యలను ఆయా మండలాల పరిధిలోని తహాశీల్దార్ల దృష్టికి తీసుకెళ్ళి సకాలంలో పరిష్కరించడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా ప్రభుత్వం మంజూరు చేస్తున్న నవరత్నాల పథకాలకు సంబంధించి విన్నవించే సమస్యలపై అర్హులైన వారందరికి మంజూరు చేయడం జరుగుతుందన్నారు. భూ సమస్యలకు సంబంధించి విచారణ జరిపి గడువులోపు పరిష్కరిస్తామన్నారు. ప్రతిసోమవారం జరిగే స్పందనా కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్పందనా కార్యక్రమానికి డివిజన్ స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు. అదే విధంగా మున్సిపల్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ మనూజారెడ్డి అధ్యక్షతన స్పందనా కార్యక్రమం జరిగింది. పట్టణ ప్రజలు పలు సమస్యలను విన్నవించారు.

# 10వ తరగతి విద్యార్థులకు ఉచితంగా పరీక్షల కిట్ పంపిణి

మదనపల్లె, మార్చి 27 ప్రభాతవార్త :



పట్టణంలోని నెహ్రూమున్సిపల్ హైస్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులకు లయన్స్‌క్లబ్ అభయ ఆధ్వర్యంలో సోమవారం పరీక్షల కిట్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ అభయ అధ్యక్షులు దేశాయ్ జయదేవరెడ్డి ఆధ్వర్యంలో కిట్లు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పదవతరగతి పరీక్షలను బాగా రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణత కావాలన్నారు. విద్యార్థులకు దశ, దిశ నిర్ణయించేది పదవతరగతి పరీక్షలే అన్నారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ట్రెజరర్ బి.కరుణాకర్, సర్వీసెస్ ఛైర్మెన్ గిరిజాసాయిశేఖర్‌రెడ్డి, సభ్యులు సుధాకర్‌రెడ్డి, సునీల్, హెచ్‌ఎం హరిక్రిష్ణ, నాగసులోచనలు పాల్గొన్నారు.

# యూనియన్ క్లబ్ సెక్రటరీగా సుబ్రమణ్యం

మదనపల్లె, మార్చి 27 ప్రభాతవార్త:



మదనపల్లె ఇండియన్ యూనియన్ క్లబ్ సెక్రటరీగా సుబ్రమణ్యం('సుబ్బు)ను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. క్లబ్ అధ్యక్షులుగా రాటకొండ బాబురెడ్డి, గౌరవ అధ్యక్షులుగా వి.మునిస్వామిరెడ్డి, ఉపాధ్యక్షులుగా మార్పూరి సుధాకర్‌నాయుడు, ఉపకార్యదర్శిగా బోర్‌వెల్ సుధాకర్, కోశాధికారిగా దేవతాసతీష్, గేమ్స్ సెక్రటరీగా విష్ణుకాంత్, కార్యవర్గసభ్యులుగా సదాశివరెడ్డి, మార్పూరి నాగార్జునబాబు, రాటకొండ గురుప్రసాద్, శంకర్‌రెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ సందర్భం గా వీరు మాట్లాడుతూ 110ఏళ్ళ చరిత్ర కలిగిన క్లబ్‌ను అన్ని విధాల అభివృద్ధి చేస్తామన్నారు.

# జగన్ ప్రభుత్వంలో దళిత ఎమ్మెల్యేలకు రక్షణ లేదు

– గాజుల ఖాదర్‌బాషా

రాయచోటి, మార్చి 27ప్రభాతవార్త:



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో సొంత ఎమ్మెల్యేలే ప్రాణహాని ఉందని చెప్పడం అసమర్థ పరిపాలనకు నిదర్శనమని రాష్ట్ర టిడిపి కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా ఆరోపించారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలో దళిత అధికారి చిన్న అచ్చన్న మరణం ముమ్మాటికి ప్రభుత్వ హత్య అని రాష్ట్ర టిడిపి కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా పేర్కొన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో రాచరిక పరిపాలన సాగుతుందని తూర్పు గోదావరి జిల్లా వేములూరులో కూడా తెలుగుదేవం పార్టీ యూనిట్ ఇన్‌ఛార్జ్ ఉపసర్పంచ్ సత్యవరప్రసాద్‌ని పంచాయతీ నిధుల వినియోగంలో దుర్వినియోగం జరిగిందని పలు దఫాలుగా పోరాటం చేసినందుకు వైసిపి నాయకులు కుట్రపన్ని హతమార్చరన్నారు. మరోక పక్క సిఎం సొంత జిల్లాలోని దళిత ఉద్యోగి పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకుడు డాక్టర్ అచ్చన్నది కూడా హత్య అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో చట్టాలు లేవని కేవలం వైసిపి సెక్షన్లు అమలు అవుతున్నాయని దిశా చట్టం దిశా స్టేషన్లు పేరుకు మాత్రమే గోడలపై బోర్లు కనబడుతున్నాయని లోపలికి వెళ్తే వైసిపి చట్టాలు అమలు అవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బిసి నాయకుడు అబ్బవరం చిన్నరెడ్డి యాదవ్, రాయుడు కాలనీ మైనార్టీ నాయకుడు షేక్ మహబూబ్ అలీలు పాల్గొన్నారు.

# వాహనాలకు బహిరంగ వేలం పాటలు

మదనపల్లెక్రైం, మార్చి 27 ప్రభాతవార్త:

మదనపల్లె స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరో స్టేషన్‌పరిధిలో ప్రోహిబిషన్, ఎక్సైజ్ పోలీసులు వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈనెల 29 బుధవారం బహిరంగ వేలం వేయనున్నట్లు ఎస్‌ఈబి పోలీసులు తెలిపారు. బుధవారం ఉదయం 10గంటలకు స్థానిక ఎస్‌ఈబి స్టేషన్‌లో మదనపల్లె నందు బహిరంగ వేలం నిర్వహించబడునని తెలిపారు.

# కురబలకోటలో బ్రహ్మోత్సవాలు

కురబలకోట, మార్చి 27 ప్రభాతవార్త:

మండల కేంద్రమైన కురబలకోటలో వెలసిన శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 29నుంచి ప్రారంభం అవుతాయని ఆలయ ధర్మకర్త కెబి.లక్ష్మనరావు తెలిపారు. 29న అంకురార్పణతో ఈ బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయని ఆయన తెలిపారు. బుధవారం ధ్వజారోహణం, హనుమంతువాహనం, 31న సింహవాహనం, ఏప్రిల్ 1న శేషవాహనం, 2న సూర్యప్రభ, 3న మోహీని ఉత్సవం, గజవాహనం, 4న కళ్యాణోత్సవం(గరుడోత్సవం), 5న బ్రహ్మరథోత్సవం(తేరు), 6న అశ్వవాహనం, 7న వసంతోత్సవం, హంసవాహనం, 8న క్షయనేత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆయన తెలిపారు. ఈ బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాటు చేసినట్లు ధర్మకర్త తెలిపారు.

# మిట్స్‌లో ప్రపంచ నాటక దినోత్సవం

కురబలకోట, మార్చి 27 ప్రభాతవార్త:



విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు నాటకరంగం దోహదపడుతుందని మిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్ అన్నారు. సోమవారం మిట్స్ ఫిలింమేకర్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ నాటక దినోత్సవాన్ని నిర్వహించారు. దీనిని పురస్కరించుకొని విద్యార్థులకు మూవిస్కిట్, డైలాగ్ రైటింగ్, సినిమాటోగ్రఫి తదితర పోటీలు నిర్వహించారు. పోటీలలో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫిలింమేకర్స్‌క్లబ్ కోఆర్డినేటర్ రియాజ్, ఇంగ్లీష్ విభాగాదిపతి తమీన విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# ప్రజల దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాలు ఏర్పాటు

కలికిరి, మార్చి 27 ప్రభాతవార్త:



పంచాయితీలోని ప్రజలు దాహార్తి తీర్చేందుకే ఎంపిడిఓ గంగయ్య ఆదేశాల మేరకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ నాగవేణి, కార్యదర్శి రమేష్‌నాయుడులు తెలిపారు. సోమవారం మేడికుర్తిలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ప్రజలు వేసవికాలంలో మంచినీటి సమస్యతో వడదెబ్బ బారిన పడకుండా ప్రజలను ఆదుకునేందుకే చలివేంద్రాలు ఏర్పాటు చేశామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ తెలిపారు.

# దళిత వ్యతిరేక బిల్లును ఉపసంహరించుకోవాలి

బిజెపి ఎస్‌సి మోర్చా నాయకులు డిమాండ్

మదనపల్లె, మార్చి 27 ప్రభాతవార్త:



ప్రభుత్వం ఒక మతాన్ని ప్రోత్సహించే విధంగా అసెంబ్లీలో ప్రవేశపెట్టిన దళిత వ్యతిరేక బిల్లును ఉపసంహరించాలని అన్నమయ్య జిల్లా బిజెపి ఎస్‌సి మోర్చా ఆధ్వర్యంలో ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిజెపి రాజంపేట జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఏవి.సుబ్బారెడ్డి ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బిల్లు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రచించిన రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందన్నారు. నిజమైన దళితులను అణగదొక్కే విదంగా ఉందన్నారు. క్రిష్టియన్ మతాన్ని స్వీకరించిన తరువాత వారు క్రిష్టియన్లుగానే వ్యవహరించబడుతారని తెలిపారు. ఈ బిల్లు రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌సి మోర్చా జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు పులి నరేంద్రకుమార్‌రెడ్డి, నరసింహులు, మహేష్, పురుషోత్తం, వసంతకుమార్‌లు పాల్గొన్నారు.

# నేటి నుంచి పురుషులకు కు.ని.ఆపరేషన్‌లు : డాక్టర్ చంద్రశేఖర్

నందలూరు, మార్చి 27 ప్రభాతవార్త

నందలూరు, రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో నేటినుంచి 3 రోజులు ఎన్‌ఎస్‌వి కోత, కుట్టులేని వాసెక్టమి – పురుషులకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు జరుగుతాయని, కావున మండలంలోని కుటుంబ నియంత్రణ ఆపరేషన్ కోరుకునే దంపతులకు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రభుత్వ వైద్యులు డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. స్త్రీలతో పోలిస్తే పురుషుల్లో సంతాన నిరోధక ఆపరేషన్ చేయడం చాలా సులువు. ఎటువంటి కోత, కుట్టు లేకుండానే ఆపరేషన్ అయిపోతుందని, ఆపరేషన్ అయిపోయిన రోజే ఇంటికి కూడా వెళ్లవచ్చునని, ఎటువంటి అపోహలు పెట్టుకోకుండా ఇద్దరు పిల్లలున్న తల్లిదండ్రులు అందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆపరేషన్ చేసుకోవాలని వైద్యులు పిలుపునిచ్చారు. వివరాలకు మీ సచివాలయం ఎఎన్‌ఎం లేదా ఆశాలను సంప్రదించాలన్నారు.

# స్పందన ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి

చిట్వేలి, మార్చి 27 ప్రభాతవార్త 4



ప్రజల సౌలభ్యం కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన స్పందన కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని స్థానిక తహశీల్దారు మురళీకృష్ణ అధికారులకు సూచించారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేసి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందన ఫిర్యాదుల పరిష్కార వ్యవధిని పదుల సంఖ్యకు తగ్గించాలని అన్నారు. ఓవర్ కాంట్రాక్టర్‌కు ఆధార్ అనుసంధానం ప్రక్రియను భూముల రీసర్వే కార్యక్రమాన్ని స్పందన ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు.కార్యక్రమంలో భూ రీసర్వే డిప్యూటీ తహశీల్దారు సుమని, గ్రామ రెవెన్యూ అధికారులు భాస్కర్, భుజంగరావు, ఉదయ్ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేకు జ్ఞాపిక అందజేత

వాల్మీకిపురం, మార్చి 27 ప్రభాతవార్తః



స్థానిక ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి మండలానికి చెందిన రాజంపేట వైకాపా పార్లమెంటరీ నాయకులు వెంకటరమణ అలియాస్ రాయుడు, ఆనంద్ తదితరులు ఎమ్మెల్యేకు జ్ఞాపికను అందజేశారు. ఇటీవల రాష్ట్ర రాజధానిలో ఉగాది వేడుకల్లో హిందూ సాంప్రదాయ పద్ధతిలో పంచ, కండువా ధరించి పాల్గొన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని కలిసి జ్ఞాపికను అందజేసి కతజ్ఞతలు తెలియజేశారు. ఈచిత్రాన్ని ఫోటో చేయించిన వైకాపా నాయకులు సోమవారం దీనిని ఎమ్మెల్యేకు జ్ఞాపికగా అందజేశారు. కార్యక్రమంలో జర్రావారిపల్లె వైకాపా నాయకులు పాల్గొన్నారు.

# దారుసలాం అహ్లే అదీస్ వెల్ఫేర్ ట్రస్టు ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ

పీలేరు, మార్చి 27 ప్రభాతవార్తః



పట్టణంలోని సరోజనీదేవి వీధిలోని దారుసలాం అహ్లే హదీస్ వెల్ఫేర్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మసీదు గురువు ఇమామ్ జాబీర్ ఉమ్రి ఆధ్వర్యంలో మహమ్మద్ ప్రవక్త ప్రవచనాలు వల్లించడం జరిగింది. ఈసందర్భంగా ట్రస్టు కార్యదర్శి బోదేశా, అధ్యక్షులు యూసఫ్ మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాల నుంచి రంజాన్ మాసంలో నిరుపాయలకు వితంతువులకు రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈసంవత్సరం తమ ట్రస్టు ఆధ్వర ంలో మసీదు నిర్మాణం చేసినట్లు తెలిపారు. మహమ్మద్ ప్రవక్త ప్రవచనం మేరకు పొరుగు పొరుగు వారు పస్తులుండి తాను మాత్రమే భుజించుట పాపం అనే సూక్తి మేరకు ఇరుగుపొరుగు పేదలు కూడా ఉపవాసాలు ఉండటానికి మాసేవా కార్యక్రమాలు ఉపయోగపడుతాయన్నారు. ఇరుగుపొరుగు పేద వితంతు ముస్లీం కుటుంబానికి రంజాన్ తోఫాలో భాగంగా 25 కేజీల బియ్యం, 3కిలోల గోధుమ పిండి, కిలో చక్కెర, రవ్వ 2లీటర్ల నూనె పంపిణీ చేసినట్లు తెలిపారు.కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షులు యూసఫ్, కార్యదర్శి బోదేషా, ఉపాధ్యక్షులు సలలీంబాష సభ్యులు మహమ్మద్ నూర్, అక్బర్‌బాసా, కరీంబాషా, ఆసిఫ్, ఆరీఫుల్లా తదితరులు పాల్గొన్నారు.

# అభివద్ధి పనులను తనిఖీ చేసిన సర్పంచ్

పీలేరు, మార్చి 27 ప్రభాతవార్తః



పంచాయతీ పరిధిలో జరుగుతున్న అభివద్ధి పనులను స్థానిక సర్పంచి డాక్టర్ హబీబ్‌బాషా సోమవారం తనిఖీచేశారు. రాజీవ్‌నగర్ లో పలుచోట్ల కల్వర్టులు దెబ్బతిన్నాయి. వీటి స్థానంలో నూతనంగా కల్వర్టులు ఏర్పాటుచేస్తున్నారు. వీటిని ఆయన పరిశీలించారు. ప్రజా సమస్యలపై ఎప్పుడైనా తనకు ఫిర్యాదు చేయవచ్చునని స్థానికులకు సర్పంచ్ సూచించారు. కార్యక్రమంలో ఈఓ ప్రసాద్ రెడ్డి, కళావతి , అబిదా, జవహర్, చిన్న, మునీర్, షాకీర్, హయ్యద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

వాల్మీకిపురం, మార్చి 27 ప్రభాతవార్తః



అంగన్‌వాడీలో పనిచేసే కార్యకర్తలు పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్థానిక ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో నియోజకవర్గంలోని ఆరు మండలాలకు సంబంధించి నూతనంగా ఎంపిక కాబడిన మంది (టీచర్లు, హెల్పర్లు)కి ఎమ్మెల్యే నియామక పత్రాలను పంపిణీ చేశారు. అనంరతం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం పిల్లలు ఆరోగ్యాన్ని దష్టిలో ఉంచుకుని అంగన్‌వాడీ పౌష్టికాహారాన్ని అందిస్తున్నదని అంగన్‌వాడీలు 100శాతం నిరుపేద పిల్లలకు అందించి వారి అభివద్ధికి కషి చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సీడీపీఓ భారతి, సిబ్బంది రాజమ్మ,నాయకులు భాస్కర,రాయుడు తదితర వైకాపా నాయకులు పాల్గొన్నారు.

# కన్నుల పండుగగా ద్వజారోహణం

వాల్మీకిపురం,మార్చి 27 ప్రభాతవార్తః



వాల్మీకిక్షేత్ర శ్రీపట్టాభిరాముడి ఆలయంలో శ్రీశోభకతనామ ఏడాదిని పురస్కరించుకుని శ్రీరాముడు వార్షక సాలికట్ల బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని తితిదే వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య కన్నుల పండుగగా నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో ఉదయత్పూర్వం స్వామివారికి సుప్రభాతసేవతో కార్యక్రమాలు ప్రారంభమైయ్యాయి. ఆలయ ఆస్థాన మండపంలో ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనసేవ నిర్వహించారు. ఉదయం 7గంటలకు ద్వాజారోహణ అనంతరం భేరి తాడనం, దేవత ఆహ్వాన కార్యక్రమాలను అత్యంత భక్తి శ్రద్దలతో నిర్వహించారు. సాయంత్రం 6గంటలకు ఊంజల్ మండపంలో స్వామివార్లకు ఊంజలసేవ నిర్వహించారు. రాత్రి 7గంటలకు విశేషాలంకరణలో ముస్తాబైన స్వామివార్లకు గజవాహనంపై అధిరోహించి వాల్మీకి క్షేత్రంలో నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. స్వామివారు వాహన సేవలో ఊరేగుతుండగా స్థానిక బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మహిళలు పిండిదీపాలను వెలిగించి వాహనానికి ఇరువైపులా కదులుతూ స్వామివారికి స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో తితిదే వేదపండితులు మణికంఠ భట్టార్, తితిదే స్థానిక ఆలయాల ప్రధాన అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, ఏఈఓ గురుమూర్తి, సూపరింటెండెంట్ మునిచెంగల్‌రాయులు , ఆలయ అధికారి కష్ణమూర్తి, తితిదే వేదపండితులు, అధికారులు, బ్రాహ్మణ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలి

కలకడ, మార్చి 27ప్రభాతవార్తః



స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కోసం ప్రతి ఒక్కరు కషిచేయాలని ఎంపీపీ శ్రీదేవి రవికుమార్ అన్నారు. సోమవారం కలకడ మండల కేంద్రంలో ఎస్‌డబ్ల్యూపీసీ కార్యాలయం నందు ఎంపీపీ శ్రీదేవి రవికుమార్, ఎంపీడీఓ సీహెచ్ నారాయణ, ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్‌లో భాగంగా క్లాస్ చెత్త సేకరణ ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మన రాష్ట్ర సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన క్లీన్ ఆంధ్రప్రదేశ్ ప్రోగ్రామ్ ద్వారా గ్రామాలలో ప్రజలు వారి ఇంటి వద్ద నుంచి బయట పడవేసే చెత్తను లోతడి చెత్త, పొడి చెత్తగా వేరుచేసి ఇవ్వాలని అన్నారు. గ్రామ పంచా యతీ కార్మికులు ఈతడిచెత్త, పొడి చెత్తను తీసుకెళ్లి వర్మీకంపోస్టుగా తయారు చేసి ఆ వర్మీకంపోస్టు సేంద్రీయ ఎరువులను కూరగాయలకు పళ్ల పళ్ల తోటలకు ఉపయోగించడం వలన అధిక లాభాలు కలుగుతాయని తద్వారా గ్రామ పంచా యతీకి ఆదాయం వస్తుందన్నారు. గ్రామాలలో పురవీధులలో పరిశుభ్రంఆ ఉం టుందని ఇలా గ్రామాలు పరిశుభ్రంగా ఉండటం వలన మన సీఎం ఆశయాలు ప్రకారం స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌గా చేయవచ్చునన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వెటర్నరీ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లతో పాటు కలకడ మండలం లోని ఉపసర్పంచిలు నందిని, శివాజీ,

# నేడు వైఎస్ఆర్ ఆసరా పంపిణీ : ఎంపిడిఒ

చిట్వేలి, మార్చి 27 ప్రభాతవార్త



వెలుగు సంఘాల మహిళ కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన డాక్టర్ వైఎస్ఆర్ మూడో విడత ఆసరా పంపిణీ కార్యక్రమం చిట్వేలిలోని ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఎంపిడిఒ మోహన్ పత్రికా ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వవిప్, శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు పాల్గొంటారని అన్నారు. 446 గ్రూపులకు గాను 4452 మందికి సుమారు 3.16 కోట్ల రూపాయలు మేర లబ్ది చేకూరుతుందని తెలిపారు. అర్హత పొందిన వెలుగు సంఘాల మహిళలు, అధికారులు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

# హిందూ ముసుగులో అరాచకాలు సృష్టించొద్దు

పులివెందుల, మార్చి 27, ప్రభాతవార్త :



హిందూ ముసుగులో అరాచకాలు సృష్టించడం మంచి పద్ధతి కాదని పులివెందుల మున్సిపల్ ఛైర్మన్ వల్లెపు వరప్రసాద్ అన్నారు. హిందూ ఐక్యవేదిక సభ్యులు ర్యాలీ నిర్వహించిన అనంతరం మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, రాష్ట్ర సివిల్ సప్లైస్ డైరెక్టరు గంగాధర్‌రెడ్డి, దేవస్థాన మాజీ ఛైర్మన్ వెంకట సుబ్బయ్య, మిట్టమల్లేశ్వరస్వామి దేవస్థాన ఛైర్మన్ సుధీకర్‌రెడ్డి, కౌన్సిలరు విజయ్‌కుమార్, కోఆప్షన్ సభ్యుడు చంద్రమౌళితో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో ఎప్పుడూ మార్కెట్‌కు శ్రీరంగనాథస్వామి పేరు కూగాయల మార్కెట్‌కు లేదని, ప్రారంభ దశలో కూడా శిలాఫలకాలపై కూడా శ్రీరంగనాథస్వామి కూరగాయల మార్కెట్ అని లేదన్నారు. అదే విధంగా మున్సిపల్ సంబంధించిన గెజిట్‌లో కూడా ఆ ప్రస్తావన ఎక్కడా లేదన్నారు. ఆలయ సమీపంలో ఉండడంతో కొందరు అలా పిలుచుకునే వారేమో కానీ అధికారికంగా ఎక్కడా ఆ పేరు లేదని ఒకవేళ ఉన్న పేరును తీసి మార్చాల్సిన పరిస్థితి ఇక్కడ ఎవరికీ లేదని, అనవసరంగా హిందూ ఐక్యవేదిక పేరుతో ప్రశాంతంగా ఉన్న ఊరును గందరగోళ పరిస్థితికి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మా అధినాయకత్వం ఎప్పుడూ తప్పు చేయదని, అలా చేయమని కూడా మాకు ఎప్పుడూ చెప్పదన్నారు. వారి అడుగు జాడల్లో నడవడమే మా పని అని తెలిపారు. ఇప్పటికైనా హిందూ ఐక్యవేదిక పేరు ముసుగులో ఉన్న వారు జ్ఞానాన్ని సంపాదించుకుని అభివృద్ధికి తోడ్పడాలని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చొరవతో పులివెందుల పట్టణంలో ఎన్నో హిందూ దేవాలయాలు అభివృద్ధి చెందాయని, వాటిని కూడా గ్రహించాలన్నారు. వారపుసంతలో ఉన్న వ్యాపారస్థులందరు కలిసి ఈ మార్కెట్‌కు దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేరు పెట్టాలని కమీషనర్‌కు, తనకు వినతిపత్రం కూడా ఇవ్వడం జరిగిందని, వారి అభీష్టం మేరకే మార్పు చేస్తున్నామన్నారు. హిందూ ఐక్యవేదిక పేరుతో నాటకం ఆడుతున్న వారు తెలుసుకుని మాట్లాడాలన్నారు.

# భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోండి

వీరపునాయునిపల్లె, మార్చి 27, ప్రభాతవార్త :

మండలంలోని అనిమెల మజరాలో బోగాదెమ్మ గ్రామ దేవత పేరిట ఉన్న భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని అనిమెల గ్రామ సర్పంచి సతీష్‌రెడ్డి తహసీల్దారును లేఖ ద్వారా కోరారు. గ్రామదేవతకు సంబంధించిన సుమారు 5ఎకరాల భూమిని గంగిరెడ్డిపల్లెకు చెందిన పోచంరెడ్డి రామాంజనేయ రెడ్డి అనే వ్యక్తి అతని సర్వే నంబర్లలో ఎక్కించుకుని కొన్నేళ్లుగా బ్యాంకులను, ఇన్సూరెన్సు కంపెనీలకు మోసం చేస్తూ లబ్ధిపొందుతున్నాడని ఆయన తెలిపారు. మీరు ఈ విషయమై స్పందించి గ్రామదేవతకు సంబంధించిన భూమిని తిరిగి అప్పగించాలని సర్పంచి కోరారు.

# గడప గడపకు ఎమ్మెల్యే కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

– మండల వైకాపా కన్వీనర్ చౌడేశ్వర

తంబళ్లపల్లె, మార్చి 27, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె మండలంలో మంగళవారం మర్రిమాకులపల్లె మండలంలో మంగళవారం మర్రిమాకులపల్లి, కన్నెమడుగు, పంచాయతీల్లో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి గడప గడపకు ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా పర్యటిస్తారని మండల వైకాపా అధ్యక్షుడు రేపన చౌడేశ్వర పిలుపునిచ్చారు. కానా మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, వాటర్‌షెడ్ ఛైర్మన్లు, ప్రజా ప్రతినిధులు, వైకాపా నాయకులు,కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్దఎత్తున హాజరుకావాలన్నారు.

# ఫిర్యాదులపై సత్వరం స్పందించి న్యాయం చేయాలి

– స్పందన (గ్రీవెన్స్ డే) కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అన్బురాజన్

కడప క్రైం, మార్చి 27, ప్రభాతవార్త:



జిల్లాలో బాధితులు పోలీసు శాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ అన్బురాజన్ స్పందనకార్యక్రమంలో బాధితులతో స్వయంగా ముఖాముఖి మాట్లాడి, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారి సమస్యలను తెలుసుకున్నారు. స్పందన ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. నడవలేని అనారోగ్యంతో ఉన్న ఫిర్యాదుదారుల వద్దకే వచ్చి ఎస్పీ ఫిర్యాదులను స్వయంగా స్వీకరించి పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఫిర్యాదుదారులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు.

# కుష్టు వ్యాధిగ్రస్థులకు చెప్పులు పంపిణీ

దువ్వూరు, మార్చి 27, ప్రభాతవార్త:



స్థానిక పీహెచ్‌సీ నందు సోమవారం మండలంలోని 13మంది కుష్టు వ్యాధి గ్రస్థులకు సూక్ష్మరుణ రబ్బరు చెప్పులను వైద్యాధికారి డా.షమీరా, డా.వికిన్నతలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుష్టువ్యాధిని సక్రమంగా మందులు వాడితే నివారించవచ్చన్నారు. విజయవాడకు చెందిన లైప్రా సంస్థ దువ్వూరు పీహెచ్‌సీ వ్యాధిగ్రస్థుల కొలతలు తీసుకొని రాజేష్, అప్పలరాజులు వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది శివరామయ్య, మురళీధర్‌మూర్తి, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

# వేలం పాటలో లక్కిరెడ్డిపల్లె పంచాయతీకి రూ.3,89,600 ఆదాయం

లక్కిరెడ్డిపల్లె, మార్చి 27, ప్రభాతవార్త:



గ్రామ పంచాయతీ బస్టాండు గేటు పంచాయతీ అద్దె గదులకు సంబంధించి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం సర్పంచు సద్దల అహల్యా, ఈఓపీఆర్డీ ఉప సర్పంచ్ రాజారెడ్డి ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో బస్టాండు గేటుకు సంబంధించి రూ.3,72,000 ఫయాజ్ బాషా దక్కించుకున్నారు. 4 అద్దె గదులు నలుగురు వ్యక్తులు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ సుదర్శన్‌రెడ్డి, అన్వర్ బాషా, పరహాన్, ప్రభాకర్, మెంబర్లు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మానవీయ విలువలు తెలిపేందుకే ఫ్యామిలీగ్లోరీ

పులివెందుల రూరల్, మార్చి 27, ప్రభాతవార్త :



పిల్లల్లో మానవీయ విలువలు తెలిపేందుకే ఫ్యామిలీగ్లోరీ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు వందన అన్నారు. పులివెందులలోని ఆర్టీవో కార్యాలయం పక్కన ఉన్న శ్రీచైతన్య పాఠశాలలో సోమవారం ఫ్యామిలీ గ్లోరీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు ఔనత్యాన్ని చాటడమే ఈ కార్యక్రమ లక్ష్యం అన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏజీఎం రమణయ్య మాట్లాడుతూ కుటుంబ వ్యవస్థ గురించి పిల్లలకు వివరించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం తమకు అమితానందాన్ని కలిగించిందని పేర్కొన్నారు. అకాడమిక్ కోఆర్డినేటరు మురళీధర్, పాఠశాల డీన్ శివకుమార్, ప్రైమరీ ఇన్‌ఛార్జి విజిత, అంజన, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రెవెన్యూ కార్యాలయ పరిధిలో చలివేంద్రం ఏర్పాటు

చిట్వేలి, మార్చి 27 ప్రభాతవార్త




అన్నమయ్య జిల్లా కలెక్టర్ పిఎస్ గిరీషా, సబ్‌కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు చిట్వేలి రెవెన్యూ కార్యాలయం ముందర స్థానిక తహశీల్దారు మురళీకృష్ణ సోమవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు అధికంగా ఉన్నందువల్ల ప్రజలందరూ అప్రమత్తం గా ఉండాలని కోరారు. ఉదయం 10 గంటల లోపు, సాయంత్రం 5 గంటల పైన మాత్రమే తమ కార్యక్రమాలను చేసుకునేవిధంగా ప్రణాళిక ఏర్పరుచుకోవాల న్నారు. రక్షణగా తలకు టోపి, చలువ అద్దాలు లాంటివి ఉపయోగించుకోవాల న్నారు. వృద్ధులు, పిల్లల పట్ల ప్రత్యేకశ్రద్ధ వహించాలని తెలిపారు. మట్టికుండలతో ఏర్పాటు చేసిన చలివేంద్రం నందు ప్రతిరోజు శుద్ధి చేసిన జలాన్ని నింపుతామని అన్నారు. కార్యాలయాలకు వచ్చేవారు స్థానిక ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహశిల్దారు మురళీకృష్ణ కోరారు. కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పీస్ కమిటీలతో సమావేశం

ప్రొద్దుటూరు క్రైం, మార్చి 27, ప్రభాతవార్త:



రంజాన్ మాసం సందర్భంగా ప్రొద్దుటూరు ఏఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం త్రీటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో సబ్ డివిజన్ స్థాయిలో అన్ని పీస్ కమిటీలతో సమావేశం నిర్వహించారు. మత సామరస్యం కోసం పాటించాల్సిన సూచనలు, సలహాలను శాంతి కమిటీ సభ్యులతో చర్చించడమైంది. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్, 2 టుటౌన్, మరియు 3 టౌన్ పోలీసు స్టేషన్ల సీఐలు హాజరయ్యారు.

## కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు

లక్కిరెడ్డిపల్లె, మార్చి 27, ప్రభాతవార్త:



పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నమయ్య జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి జాకీర్ హుసేన్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం లక్కిరెడ్డిపల్లెలోని ఎస్సీ 1, 2 బాలికల వసతి గృహాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ అందిస్తున్న మెనూ ప్రకారం అన్ని అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఎస్సీ వసతి గృహాల్లో 490 మంది విద్యార్థులు 10వ తరగతి విద్యార్థులకు రాయచోటిలో పది రోజుల కిందట పబ్లిక్ పరీక్షలపై శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. పదిలో మంచి ఫలితాలు సాధిస్తే కార్పొరేట్ కాలేజీల్లో ప్రభుత్వం ఉచితంగా సీటు ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూఓలు శ్రీనివాసులు, రమేష్, సూర్యకాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వైఎస్ఆర్ ఆసరా విడత సంబరాలు

పెండ్లిమర్రి, మార్చి 27, ప్రభాతవార్త:




మండలంలో వైఎస్ఆర్ మూడో విడత సంబరాలను ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి సోమవారం ఘనంగా ప్రారంభించారు. అర్హులైన లబ్ధిదారులకు రూ.7.70 లక్షల మెగా చెక్కును ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం కేక్ కటింగ్ చేసి సీఎం జగన్ ఫొటోకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమం విజయవంతానికి ఎమ్మెల్యేతో పాటు ప్రాజెక్టు డైరెక్టర్ డీఆర్‌డీఏ ఆనంద్ నాయక్, సికె.దిన్నె జడ్పీటీసీ సభ్యులు నరేన్ రామాంజులురెడ్డి, తహసీల్దార్ ఉదయభాస్కర్‌రాజు, ఎంపీడీవో అల్తాఫ్ హుసేన్, మండల ప్రెసిడెంట్ వరలక్ష్మీ, జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ బాలయ్య, మండల రెవెన్యూ అధికారి మండల స్థాయి అధికారులు ఏరియా కోఆర్డినేటర్ రఘునాథరెడ్డి, ఏపీఎంలు వెంకటేశ్వరరావు, పూర్ణిమ, సీసీలు, వీఓఏలు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు పాల్గొని విజయవంతం చేశారు.

## గృహ నిర్మాణాలపై సమీక్ష

దువ్వూరు, మార్చి 27, ప్రభాతవార్త:



స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం మండల స్థాయి అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు కలిసి గృహ నిర్మాణంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి ఓబులేసు నందన్ మాట్లాడుతూ గ్రామాలకు కేటాయించిన పక్కా గృహాల నిర్మాణ లక్ష్యాలు సాధించాలన్నారు. ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు కలిసి సమన్వయంతో పని చేయాలన్నారు. జగనన్న కాలనీలను అన్ని మౌలిక వసతులున్నాయని అక్కడ నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. అనంతరం స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించి పరిష్కరించాలని కింది స్థాయి అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఓబులేసు నందన్, తహసీల్దారు రమాకుమారి, ఎంపీడీవో జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ గారూ.. రెడ్డికుంట ఆక్రమిత భూములు కాపాడండి

– గ్రామస్థుల వినతి

ఓబులవారిపల్లె, మార్చి 27, ప్రభాతవార్త:



ఓబులవారిపల్లె మండలం రెడ్డికుంట భూమిలో కొందరు ఆక్రమిత కట్టడాలు కట్టడంతో పాటు యతేచ్ఛగా భూములు ఆక్రమిస్తున్నారని ఆ భూములను కాపాడాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గ్రామస్తులు కలెక్టరుకు ఫిర్యాదు చేస్తున్నారు. పలుమార్లు ఇరిగేషన్ అధికారులకు తహసీల్దార్ పీర్‌మున్నీ నివేదికలు పంపి ఆక్రమిత భూములపై చర్యలు తీసుకోవాలని లెటర్లు పెట్టినా పలు మార్లు బూములపై హెచ్చరిక బోర్డులు పాతినా వాటిని తొలగించి యథేచ్ఛగా భూములు సాగు చేయడం భూ కబ్జాదారుల దౌర్జన్యాలు రోజు రోజు పెరిగిపోతున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకొని ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## 29న వైఎస్సార్ ఆసరా కార్యక్రమానికి హాజరుకావాలి

– ఎంపీడీవో రామకృష్ణయ్య

బద్వేలు అర్బన్, మార్చి 27 ప్రభాతవార్త :

ఈ నెల 29వ తారీఖున టీటీడి కళ్యాణ మండపంలో బద్వేలు ఎండీవో రామకృష్ణయ్య ఆధ్వర్యంలో జరగబోవు వైఎస్సార్ మూడవ విడత ఆసరా కార్యక్రమానికి మండలంలోని 10 పంచాయతీలలోని ప్రజా ప్రతినిధులు, స్వయం సహాయక సంఘ సభ్యులు, అధికారులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎండీవో రామకృష్ణయ్య తెలియజేశారు.కార్యక్రమానికి ఎమ్మెల్సీ డి.సి.గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డా॥ సుధ, తహసీల్దారు మధు సూదన్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు, అధికారులు హాజరవుతారని వారు తెలియజేశారు.

## జగనాసుర రక్త చరిత్ర పుస్తకం ఆవిష్కరణ

ఒంటిమిట్ట మార్చి 27 ప్రభాతవార్త:



సోమవారం ఒంటిమిట్టలో పార్టీ ఆదేశాల మేరకు జగనాసుర రక్త చరిత్ర పుస్తకంను ఆవిష్కరించినట్లు మండల టిటిడి ప్రదాన కార్యదర్శి బొబ్బిలిరాయుడు తెలిపారు. సోమవారం ఒంటిమిట్టలో మండల టిడిపి నాయకులు జగనాసుర రక్త చరిత్ర పుస్తకం ను ఆవిష్కరించారు. వివేక హత్యలో సూత్రాదారులు ఎంత పెద్ద స్దాయిలో వున్న వారికి శిక్ష పడక పోతే నరహంతుకులు విచ్చలవిడిగా రెచ్చిపోతారన్నారు. రాష్ట్రంలో ప్రజలధనమాన ప్రాణాలకు రక్షణ ఉండదాన్నరు. అందుకే హత్యలో సూత్రదారులను జాప్యం లేకుండా సిబిఐ కోర్టు బోన్‌లో నిలబట్టాలని డిమాండ్ చేశారు. ఈ కా ర్యక్రమంలో మండల టిడిపి నాయకులు రామదాసు,డాక్టర్ జిలానీ,డాక్టర్ కృష్ణ, వెంకటసుబ్బారెడ్డి, ఉన్నం కిరణ్‌కుమార్, ఆలూరు వెంకటసుబ్బయ్య,ఆమానుల్లా, వీరాంజనేయరెడ్డి,వెంకటరమణ,ఆనంతయ్య, శేఖర్‌రెడ్డి, సుదాకర్, జవాజి వెంకటరమణ,గంగయ్య, నిత్యనారాయణ ,నాగరాజు, వెంకటేశు తదితరులుపాల్గోన్నారు.

## ఆర్థిక శక్తిగా మహిళలు అభివృద్ధి చెందాలి

– ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం – ఎమ్మెల్యే

ఓబులవారిపల్లె, మార్చి 27, ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేయడంతోపాటు స్వయం సహాయక సంఘాల మహిళా సాధికారకతతో కోట్ల రూపాయలు అందించి అభివృద్ధి చెందేలా అన్ని విధాలా ప్రజలకు చేయూత అందిస్తోం దని రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు సూచించారు. సోమవారం మండల కేంద్రమైన ఓబులవారిపల్లె స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నిర్వహించిన జగనన్న స్వయం సహాయక సంఘాలకు రూ.7,91,54,000 చెక్కును ద్వాక్రా మహిళలకు అందజేశారు. స్వయం సహాయక సంఘాల మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించినప్పుడే మహిళలకు అన్ని విధాలా మంచి చేకూరుస్తుందన్నారు. మన ప్రభుత్వం అన్ని వర్గాల వారికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పెద్దపీట వేస్తోందన్నారు. సబ్సిడీ పథకాలు, వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేయడంతో పాటు రైతు సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. కావునా జగనన్న ప్రభుత్వం అందిస్తున్న పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో ఎంపీపీ చీర్ల నాగమ్మ, ఏపీ టూరిజం డైరెక్టర్ సాయికిశోర్‌రెడ్డి, నూకా జయపాల్‌రెడ్డి, వైసీపీ నాయకులు కృష్ణారె డ్డి, రమేష్‌రెడ్డి ఈశ్వరయ్య, సర్పంచ్ జయపాల్‌రెడ్డి, ఏపీవో ఆర్ముగం, సుంకేసు ల రవి, స్వయం సహాయక గ్రూపుల మహిళలు అన్ని శాఖల అధికారులు, వ్యవసాయ కమిటీ డైరెక్టర్ వెంకట సుబ్బారెడ్డి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం

– చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి టౌన్, మార్చి 27ప్రభాతవార్త:



ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరంలా మారిందని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం రాయచోటి వైఎస్సార్ సిపి కార్యాలయంలో 8 మంది లబ్దిదారులకు రూ.6.14 లక్షలు విలువ చేసే చెక్కులను ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అందజేశారు. రాయచోటి రూరల్ మండలం శిబ్యాల గ్రామం వైకుంఠ రాచపల్లెకు చెందిన కొండూరు సుబ్బరామరాజుకు రూ.60 వేలు, చిన్నమండెం మండలం తిమ్మారెడ్డిగారిపల్లెకు చెందిన దేసిరెడ్డి ప్రసాద్‌కి రూ. 1.10 లక్షలు, రామాపురం మండలం బండపల్లె గ్రామం దూదేకుల పల్లెకు చెందిన కల్లూరు జయానుబికి రూ.1.30 లక్షలు, నల్ల గుట్టపల్లె బిసి కాలనీకి చెందిన బత్తల సరోజమ్మకు రూ.75వేలు, పాలన్నగారి పల్లెకు చెరందిన కోటకొండ వీరనాగులుకు రూ. 1.10 లక్షలు, గాలివీడు మండలం అరవీడు గ్రామం లక్కావాండ్లపల్లెకు చెందిన ఏటం చిన్నారెడ్డికి రూ.40 వేలు, వెలిగల్లుకు చెందిన చెదబావి షేక్ అబ్దుల్ మునాఫ్‌కు రూ.34 వేలు, లక్కిరెడ్డిపల్లె మండలం పందిళ్ళ గ్రామం సోమల వాండ్లపల్లెకు చెందిన కొక్కంటి శివారెడ్డికి రూ.55 వేలు విలువ చేసే చెక్కులను అందజేశారు.

## మహిళలకు పెద్దపీట వేస్తున్న జగనన్న

– ఎంపిపి జల్లా సుదర్శన్ రెడ్డి

గాలివీడు, మార్చి 27ప్రభాతవార్త:



మహిళలకు జగనన్న ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎంపిపి జల్లా సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈనెల 31న ఉదయం 10 గంటలకు మండల కేంద్రంలోని గాలివీడు జిల్లా పరిషత్ హైస్కూల్ బాలురలలో వైఎస్ఆర్ ఆసరా పథకం మూడవ విడత ఆర్థిక సాయాన్ని ప్రభుత్వ చీఫ్ విప్ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అందజేయనున్నారని ఎంపిపి జల్లా సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఆసరా కార్యక్రమ ఏర్పాట్లపై ఎంపిడివో శేఖర్ నాయక్, ఎపిఎం రెడ్డెయ్య, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, ప్రజాప్రతినిధులు, మండల వైసిపి నాయకుల సమన్వయంతో ఆసరా కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని తెలిపారు.

**చనిపోయిన వారి వారసులకు మాఫీ సొమ్ము:**

ద్వాక్రా సంఘాల వారీగా సభ్యురాలు తీసుకున్న రుణం, బ్యాంకు ఖాతా నెంబర్, ఐఎఫ్‌ఎస్‌సి కోడ్, ఫోన్ నెంబర్, సభ్యురాలి కులం, సభ్యురాలు జీవించి ఉన్నారా వివరాలును ప్రత్యేక యాప్ ద్వారా నమోదు చేశారని కొని న్ని చోట్ల ద్వాక్రా రుణం తీసుకున్న సభ్యులు కొంతమంది మరణించారు. అటువంటి వారి వారసు ల వివరాలు తీసుకొని వారి వ్యక్తిగత ఖాతాలో మరణించిన సభ్యురాలికి చెందా ల్సిన రుణ మాఫీ సొమ్ము అందనుంది. ఆయా సామాజిక వర్గాలకు చెందిన కార్పొరేషన్ల ద్వారా ఆసరా సాయం అందనుందని ఎంపిపి తెలిపారు.

## స్కౌట్స్ అండ్ గ్రైడ్స్ అభివృద్ధికి కృషి చేయాలి

రాయచోటి టౌన్, మార్చి 27ప్రభాతవార్త:



స్కౌట్ స్ అండ్ గైడ్ స్ అభి వృద్ధికి తగిన చర్యలు చేపట్టాల ని స్కౌట్ అధికారులను జిల్లా విద్యాశాఖాధికారి సాయిరాం పురుషోత్తం ఆదేశించారు. అన్నమయ్య జిల్లా నూతన విద్యాశాఖాధికారి గా బాధ్యతలు చేపట్టిన సాయిరాం పురుషోత్తంకు స్కౌట్ స్ అండ్ గైడ్స్ సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో మదనపల్లి డివిజన్‌లోని క్లబ్ మాస్టర్లు సో మవారం సాయంత్రం ఆయన కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పూలబొకేను ఇచ్చి దుశ్శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో కబ్ మాస్టర్లు ఈశ్వరయ్య, భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్, భూపతి, లక్ష్మీపతి, విద్యాధర్,

## కూరగాయల మార్కెట్‌కు రంగనాథస్వామి పేరును కొనసాగించాలి

– హిందూ మనోభావాలను దెబ్బతీస్తే ఊరుకునేది లేదు – ర్యాలీ నిర్వహించిన హిందూ ఐక్యవేదిక, అఖిలపక్ష పార్టీ నేతలు

పులివెందుల, మార్చి 27, ప్రభాతవార్త :

అవతార పురుషుడు శ్రీరంగనాథస్వామితో పెట్టుకుంటే నాశనం తప్పదని, 400 సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీరంగనాథస్వామి దేవస్థాన చరిత్రను చెరిపి వేయడం తగదని, కూరగాయల మార్కెట్‌కు శ్రీరంగనాథస్వామి కూరగాయల మార్కెట్ పేరును కొనసాగించాలని భారతీయ జనతాపార్టీ కిసాన్‌మోర్చ రాష్ట్ర కార్యదర్శి వంగల శశిభూషణ్‌రెడ్డి అన్నారు. పులివెందుల పట్టణంలోని శ్రీరంగనాథ కూరగాయల మార్కెట్ పేరును వైఎస్ఆర్ కూరగాయల మార్కెట్‌గా పేరు మార్పునకు నిరసనగా బీజేపీ హిందూ ఐక్యవేదిక, అఖిలపక్ష పార్టీలతో కలిసి స్థానిక మార్కెట్‌యార్డు సమీపంలోని ఆంజనేయస్వామి దేవస్థానం నుండి మున్సిపల్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శశిభూషణ్‌రెడ్డి, ఐక్యవేదిక, అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ శ్రీరంగనాథస్వామి దేవస్థానం 400 సంవత్సరాల క్రితం శ్రీకృష్ణదేవరాయల కాలం నాటి నుండి ఉందన్నారు. దానికి సమీపంలోని కూరగాయల మార్కెట్‌కు శ్రీరంగనాథస్వామి కూరగాయల మార్కెట్ పేరే కొనసాగించాలని డిమాండ్ చేశారు. దేవుడితో పెట్టుకుంటే ఎంతటి వాడైనా సర్వనాశనం అవుతాడని, ఆ విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేవుడు చల్లగా చూస్తే అందరం బాగుంటామని అంటుంటాడని అలాంటి తన సొంత ఊరిలోనే దేవుడి పేరును మారుస్తూ ఉంటే ఎక్కడ దేవుడు చల్లగా చూస్తాడని, లేదంటే స్వామివారి కోపానికి గురై వినాశనం అవుతారన్నారు. కడపజిల్లా చుట్టూ ఎన్నో కూడళ్లల్లో ఎన్నో వందల వైఎస్ఆర్ విగ్రహాలు పెట్టినా, ఎన్నో కార్యాలయాలకు వైఎస్ఆర్ అని పేరు పెట్టినా మేమెప్పుడూ వ్యతిరేకించలేదని, కానీ చారిత్రక దేవస్థానమైన ఈ రంగనాథస్వామి ఆలయ సమీపంలో ఉన్న కూరగాయల మార్కెట్‌కు శ్రీరంగనాథ కూరగాయల మార్కెట్ పేరును తీసివేసి నేడు వైఎస్ఆర్ కూరగాయల మార్కెట్ పేరు పెట్టడం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు.




పార్టీలోని కొంత మంది చోటా మోటా నాయకులు ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించి పేరు మార్పునకు కారణం అవుతున్నారని, హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నారన్నారు. వచ్చే రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. వెంటనే మున్సిపల్ కౌన్సిల్, మున్సిపల్ కమీషనరు పులివెందుల ప్రజల మనోభావాలను కించపరచకుండా వెంటనే శ్రీరంగనాథస్వామి కూరగాయల మార్కెట్‌గా పేరు ప్రకటించాలని, లేనియెడల ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పథకాల అమలు ఛైర్మన్ రామచంద్రారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుష్మ, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హరిప్రసాద్, కిసాన్‌మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్వర్‌రెడ్డి, నంద్యాల జిల్లా ఇన్‌ఛార్జి శ్రీనాథరెడ్డి, కిసాన్‌మోర్చ జిల్లా ఉపాధ్యక్షుడు రాజశేఖర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రమణారెడ్డి, పులివెందుల తెదేపా మాజీ పట్టణ అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె వెంకటరామిరెడ్డి, మార్కెట్ కమిటి మాజీ ఛైర్మన్ తూగుట్ల మధుసూధన్‌రెడ్డి, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటి మాజీ ఛైర్మన్ నంద్యాల హేమాద్రిరెడ్డి, హిందూ ఐక్యవేదిక సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సిఎం మాట నిలబెట్టుకున్నారు

మీరూ మాట అండగా నిలబడండి

ఎమ్మెల్యే మేడా, జడ్‌పి ఛైర్మన్ ఆకేపాటి

రాజంపేట అర్బన్, మార్చి 27 ప్రభాతవార్త



జగన్ పాదయాత్రలో పొదుపు సంఘాల మహిళలకు హామీ ఇచ్చిన మేరకు నిధులు మంజూరు చేసి మాట నిలబెట్టుకొన్నారని, పొదుపు సంఘాల మహిళలు కూడ ముఖ్యమంత్రికి అండగా నిలిచి తామున్నామని భరోసా ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జడ్‌పి ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డిలు పేర్కొన్నారు. సోమవారం రాజంపేట గ్రామీణ మండలంలో 724 స్వయం సహాయక సంఘాలకు వైఎస్ఆర్ ఆసరా ద్వారా 5.93 కోట్ల చెక్కును, రాజంపేట మున్సిపాలిటి పరిధిలో 466 పొదుపు సంఘాల మహిళలకు మెప్మా ఆధ్వర్యంలో 4.27 కోట్ల చెక్కును ఎమ్మెల్యే, జడ్‌పి ఛైర్మన్, మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డిలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరుసగా అధికారంలోకి వచ్చిన తర్వాత 3 యేడాది కూడా ఆసరా పథకం కింద పొదుపు సంఘాల మహిళల ఖాతాల్లో నిధులు జమ చేయడం జరిగిందన్నారు. మహిళల జీవితాల్లో వెలుగు నింపడమే సిఎం లక్ష్యమన్నారు. మహిళలు ఈ నిధులతో ఆర్థిక సాధికారిక సాధించాలని కోరారు. అంతకుముందు మహిళలు సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసి జైజగన్ అంటూ నినాదం చేశారు. ఈ కార్యక్రమంలో రాజంపేట మార్కెట్‌కమిటి ఛైర్మన్ పోలి వెంకటసుబ్బారెడ్డి, రాష్ట్ర ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి చిదానందగౌడ్, ఆర్‌డిసి డైరెక్టర్ గండికోట గుల్జార్‌బాషా, వైకాపా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆకేపాటి మురళిరెడ్డి, వైకాపా బిసిసెల్ పార్లమెంట్ కార్యదర్శి పసుపులేటి సుధాకర్, వైకాపా నేతలు మందరం గంగిరెడ్డి, శరత్‌కుమార్‌రాజు, ఉమామహేశ్వర్‌రెడ్డి, పిండిబోయిన రాముయాదవ్, బొల్లినేని రామ్మోహన్‌నాయుడు, భాస్కర్‌రాజు, రఘుయాదవ్, సత్యాల రామక్రిష్ణ, మిరియాల సురేఖ, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటిని అభివృద్ధి పథంలో నడపాలి

– ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సూచన

రాయచోటి టౌన్, మార్చి 27ప్రభాతవార్త:



మున్సిపాలిటిని అభివృద్ధి పథంలో నడపాలని రాయచోటి నూతన మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్‌కు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. మున్సిపల్ కమిషనర్‌గా గంగా ప్రసాద్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం గౌరవప్రదంగా ఎమ్మెల్యేని కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులలో పారిశుధ్యం, త్రాగునీటి సరఫరా మెరుగునకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కమిషనర్‌కు సూచించారు. అభివృద్ధి పనులలో వేగం పెంచాలని శ్రీకాంత్‌రెడ్డి ఆదేశించారు.

## సీతారాముల కళ్యాణోత్సవంలో పాల్గొన్న రమేష్‌రెడ్డి, ప్రసాద్‌బాబులు

రామాపురం, మార్చి 27ప్రభాతవార్త:



మండలంలోని కుమ్మరపల్లి పంచాయతీ మన్నేరువాండ్లపల్లెలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామలక్ష్మణ హనుమత్ సమేత ఆలయంలో గత శనివారం నుంచి సోమవారం వరకు మూడు రోజుల నుండి జరుగుతున్న హోమాలు, పూజలు నిర్వహిస్తున్నారు. సోమవారం విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజ ప్రతిష్ఠ, సీతారాముల కళ్యాణం, తెలుగుదేశం పార్టీ నాయకుడు మన్నూరు రామానుజులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కళ్యాణానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాయచోటి నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జ్ ఆర్. రమేషఫ్‌కుమార్‌రెడ్డి, మాజీ టిటిడి పాలక మండలి సభ్యులు సుగవాసి ప్రసాద్‌బాబులు విచ్చేసి స్వామి వారిని దర్శించుకొని, స్వామి వారి కళ్యాణం దగ్గర పూజారులచే ఆశీరా ్వదం తీసుకొని పండితులు వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. రమేష్‌రెడ్డి, ప్రసాద్‌బాబులను ఘనంగా ఆహ్వానించి గజమాల వేసి శాలువ కప్పి సన్మానించారు. టిడిపి నాయకులు

## నూతన రామాలయం ప్రారంభం

చిట్వేలి, మార్చి 27 ప్రభాతవార్త



చిట్వేలి మండల పరిధిలోని మార్గోపల్లె పంచాయతి వైఎస్ఆర్‌నగర్ ఎస్టకాలని నందు నూతన రామాలయాన్ని మాజీ సర్పంచ్ ఎం.సుధీర్‌రెడ్డి సోమవా రం ప్రారంభించారు. మాజీ సర్పంచి సొంత నిధులతో చేపట్టిన ఈ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా ప్రారంభించారు. ఆలయ నిర్మాణదాత సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ఆర్‌నగర్ కాలనిలో ప్రజల కోరిక మేరకు రాములవారి ఆలయ నిర్మాణాన్ని చేపట్టడం జరిగిందని తెలియజే శారు. భగవత్ స్వరూపమైనను మానవమాత్రుడిగా రూపందాల్చి కష్టసుఖాలను అనుభవించి మనందరికి దిశ నిర్దేశం చేసిన రాములోరి జీవితం ఎల్లప్పటికి ఆదర్శప్రాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## టిప్పర్ - స్కూటర్ ఢీ – ఇద్దరికి తీవ్ర గాయాలు

రామాపురం, మార్చి 27ప్రభాతవార్త:

కర్నూలు–చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం కసిరెడ్డిగారిపల్లి పంచాయతీ, మేదురపల్లి సమీపంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్కూటర్ టిప్పర్‌ను ఢీకొని అహమ్మద్ సబ్‌సుమ్‌లకు తీవ్ర గాయాలు అయ్యాయి. బంధువుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గువ్వలచెరువుకు చెందిన అహమ్మద్, సబ్‌సుమ్‌లు లక్కిరెడ్డిపల్లి మండలం దిన్నిపాడు నుంచి స్కూటర్‌లో గువ్వలచెరువకు వస్తుండగా జాతీయ రహదారి రోడ్డుకు వచ్చే సమయంలో కడప వైపు నుంచి నీలకంఠ్రావు పేటకు వెళ్తున్న టిప్పర్ స్కూటర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో వారికి ఇరువురికి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని స్థానికుల సహాయంతో ప్రైవేటు వాహనంలో కడప రిమ్ స్‌కు తరలించారు. ఈ మేరకు రామాపురం పోలీసులు కేసు నమోదు చేసి దరా ్యప్తు చేస్తున్నారు.

## బిజెపి ప్రభుత్వం కక్షపూరిత చర్యను ఖండిస్తున్నాం

– కాంగ్రెస్ పార్టీ ఎపిసిసి వైస్ ప్రెసిడెంట్ పిఎం. కమలమ్మ

పోరుమామిళ్ళ రూరల్, మార్చి 27ప్రభాతవార్త:



రాజకీయ కక్షతోనే రాహుల్ గాంధీని ఎంపి పది నుండి తొలగించారని కాంగ్రెస్ పార్టీ ఎపిసిసి వైస్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే పిఎం కమలమ్మ అన్నారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కేవలం అదాని అవినీతిని, ఆదాన్ని ప్రోత్సహిస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోడి పార్లమెంట్‌లో రాహుల్ గాంధిని ఎదుర్కొనే ధైర్యం లేక కుటిలమైన రాజకీయానికి పాల్పడ్డారన్నారు. ప్రజాస్వామ్యాన్ని, న్యాయవ్యవస్థను కాంగ్రెస్ పార్టీ, పార్టీ నాయకులు ఎప్పుడూ గౌరవిస్తుండడం ద్వారానే దేశంలో ఇంతవరకు ప్రజాస్వామ్యం కాపాడుకుంటూ వచ్చామన్నారు. కోర్టు శిక్షను అప్పీలు చేసుకొనే అవకాశం గౌరవ న్యాయస్థానం కల్పించినప్పటికీ ఏ మాత్రం అవకాశం ఇవ ్వకుండా రాహుల్ గాంధీపై వేటు వేయించుట కుట్ర పూరిత చర్య అన్నారు. ఈ చర్యను ఒక్క కాంగ్రెస్ పార్టీనే కాకుండా వివిధ ప్రతిపక్ష పార్టీల నాయకులు కూడా ఖండిస్తున్నారన్నారు. ప్రజలందరూ కూడా ముక్తకంఠంతో ఈచర్యను ఖండించి ప్రజాస్వామ్యపు విలువలను కాపాడుకొనుటకు ప్రజలందరి మద్దతు ఇవ్వవలసిందిగా మనవి చేస్తున్నానన్నారు. బిజెపి ప్రభుత్వ కక్షపూరిత చర్యను ఖండిస్తున్నామన్నారు.

## రాబోవు ఎన్నికల్లో చంద్రబాబు సిఎం కావడం తథ్యం

– రాయచోటి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ ఆర్. రమేష్‌కుమార్ రెడ్డి

రామాపురం, మార్చి 27ప్రభాతవార్త:



రాబోవు 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని రాయచోటి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ ఆర్. రమేష్‌కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని కల్పనాయుని చెరువు కస్పాలో హరిజనవాడ గ్రామాలలో సోమవారం ఇదే ఖర్మ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఇసుక దందా, మద్యం దందా, మట్టి దందా విపరీతంగా పెరిగిపోయని ఆయన ఆరోపించారు. తిరుమలలో కూడా గంజాయి అమ్మకాలు చేశారంటే ఈ ప్రభుత్వం ఎంత దారుణంగా దిగజారిపోయిందని ప్రజలకు అర్థం అయిందన్నారు. భూములు ఆన్‌లైన్ చేయాలంటే వైసిపి కార్యకర్తలు చెబితే తప్ప పేదవానికి న్యాయం జరిగేటట్టు లేదని ఆయన అన్నారు. ఏ పని చేయాలన్న సిఎం నియమించిన వ్యక్తులే కావాల్సిన వారు వ్యక్తులను నియమించుకున్నారన్నారు. కార్యక్రమంలో మండల యూత్ నాయకుడు నాగభూషణ్‌రెడ్డి, దిలీప్‌యాదవ్, చంద్రమౌళి, కృష్ణ, రామచంద్ర, రామకృష్ణ గౌడ్, మహబూబ్ బాషా, చిట్టిరెడ్డి, సత్యనారాయణ,సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పేద మహిళల పాలిట వరం ఆసరా పథకం

– ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు, మార్చి 27, ప్రభాతవార్త:



సీఎం జగన్ నేతృత్వంలోని వైసీపీ ప్రభుత్వ అమలు చేస్తున్న వైఎస్ఆర్ ఆసరా పథకం పేద మహిళల పాలిట వరమని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణంలో సోమవారం వైఎస్ఆర్ ఆసరా 3వ విడత్ మెగా చెక్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత తమ ప్రభుత్వం పేదలకు సంక్షేమ పథకాలు అందజేయడంలో అగ్రస్థానంలో ఉందన్నారు. ఈ క్రమంలోనే పేద మహిళలు ఆర్థిక అభివృద్ధి చెందేందుకు చేపట్టిన సంక్షేమ పథకమే వైఎస్ఆర్ ఆసరా పథకమన్నారు. 468 స్వయం సహాయ సంఘాల్లోని 4680 మహిళలకు రూ.4.62 కోట్ల అందజేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా పట్టణ ప్రాంతంలోని 509 సంఘాల మహిళలకు రూ.4.23 కోట్లు పంపిణీ చేస్తున్నామని ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ శివమ్మ, వైస్ ఛైర్మన్లు, న్యాయవాది లక్ష్మీదేవి, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఏఇరియా కోఆర్డినేటర్ ధనుంజయ, ఏపీఎం గురుకుమార్, సీసీలు, పట్టణ ప్రాంతం నుంచి రసూల్ అమ్మ ఉష, ఆర్పీలు ఆసరా, లబ్ధిదారులు, మహిళలు పాల్గొన్నారు.